ప్రజాశక్తి

Vol. 1, no. 22

(Nov. 11, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 22

(Nov. 11, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6
PRAJA SAKTI
Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు


ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 11-11-42 బెజవాడ | సంచిక 22

30 లక్షల సైన్యాన్ని రష్యా ఒక్కటే ఎదుర్కొంటోంది

నవంబరు విప్లవ దినోత్సవంనాడు కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసం



25 వ రష్యా విప్లవ దినోత్సవ సందర్భంలో సమావేశమైన మాస్కో సోవియట్ యెదుట కామ్రేడ్ స్టాలిన్ యీ క్రింది విధంగా ఉపన్యసించాడు :—

"మన దేశంలో యిపుడున్నంత నిర్మాణ బలం, పట్టుదల, యిదివరకెన్నడూ లేవు. మన ప్రభుత్వం గత సంవత్సరంలో తన దృష్టిని రెండు సమస్యలపై కేంద్రీకరించి కృషి చేసింది. మొదటి సమస్య ప్రజల యుద్ధ కృషిని నిర్మాణరీత్యా బలపరచడం; రెండవది సోవియట్ సైన్యం శత్రువుపై జయప్రదంగా దాడులుసల్పే సామర్థ్యాన్ని, ఆత్మరక్షణ కవసరమైన చాకచక్యాన్ని వృద్ధి చేసుకోవడం.

ప్రజల యుద్ధ కృషి

"ప్రజల యుద్ధ కృషిని మన మేవిధంగా బలపరచుకొన గలిగాం? పడమటి దిశలో వున్న మన పరిశ్రమలు శత్రువుల చేతుల్లో పడకుండా కాపాడడానికి, తూర్పుదిశకు వాటిని రవానా చేశాం. ఇంతేకాదు; వ్యవసాయాన్ని వృద్ధి చేసేటందుకు సాగులోలేని భూములనేకం కొత్తగా సాగుకు తీసుకొచ్చాం. ఆయుధాల సప్లయి విరివిగా జరిగేటందుకు కార్మికులలో క్రమ శిక్షణ విరివిగా వృద్ధి అయింది.

యుద్ధంలో మొదటిదశ

"గత సంవత్సరం జరిగిన యుద్ధంలో మొదటిదశ చలికాలపుదాడి. అప్పుడు సోవియట్ సైన్యం జర్మన్లను ఓడించి, వెనక్కు తరిమికొట్టింది. చొరవతో వెంటనే ముందడుగువేసి, 4 నెలలలో 250 మైళ్ళదూరం ముందుకు పోగలిగింది.

యూరప్‌లో రెండవరంగం

కాని, యూరప్‌లో రెండవ యుద్ధరంగం తెరువబడలేదు. జర్మన్లు దీన్ని అవకాశంగా తీసుకొని, నైరుతిదిశలో మన సేనలపై బడ్డారు. కొన్నిచోట్ల ముందుకు చొచ్చుకొని వెళ్ళగలిగారు. దీనితో యుద్ధంయొక్క రెండవ దశ ప్రారంభమయింది. జర్మన్ల ఉద్దేశం, అక్కడి సోవియట్ సేనలను చుట్టుముట్టి, వాటికీ - మాస్కోకు మధ్యగల సంబంధాన్ని తెంచివేయడం.

"పెట్రోలుగనులవైపు దాడిసల్పడం జర్మన్ల ప్రధానోద్దేశ్యంకాదు. అది వారి ఉద్దేశాలలో ఒకటి మాత్రమే. ప్రత్యక్షఘటనలే యిందుకు తార్కాణం. శత్రువు తన రిజర్వుదళాల నన్నింటినీ రష్యన్‌రంగంలోనే కేంద్రీకరించి, ఒకే చోట మనకంటె యెక్కువ అంగబలాన్ని సమకూర్చుకోవడం వల్లనే, యుద్ధపు యెత్తుగడలలో జయం సంపాదించగలిగాడు. రెండవ రంగం లేకపోవడం వల్లనే, జర్మన్లు తమ యెత్తుగడలను నిరపాయంగా సాధించుకొన గలిగారు."

జర్మన్‌నాయకుల యుద్ధవ్యూహం

రష్యాలో జర్మన్ నాయకుల యుద్ధవ్యూహాన్ని గురించి కామ్రేడ్ స్టాలిన్ ఈ విధంగా ఉపన్యసించాడు :

"జర్మన్ దాడియొక్క ప్రధానోద్దేశ్యమేమంటే, తూర్పువైపు నుంచి మాస్కోపై పార్శ్వపుదాడిచేసి (Outflanking Moscow from the East), మాస్కోకు తూర్పున అనేకవందలమైళ్ళ దూరంలోవున్న ఊరల్ పర్వతాలకు- మాస్కోకు మధ్యనున్న మార్గాన్ని తెగగొట్టి, అప్పుడు మాస్కోను ముట్టడించి దెబ్బతీయడం. జర్మన్లు దక్షిణదిశనున్న నూనెగనులవైపు దాడిచేయడంలో ఉద్దేశం, ఆ నూనెగనులను స్వాధీనం చేసుకోవడంకాదు. మన ప్రధాన దళాలను దక్షిణానికి మళ్ళించి, అప్పుడు మాస్కోను పట్టుకోవడమే వారి ప్రధానోద్దేశ్యం. ఇటీవల మన సైనికులు కొందరు ఒక జర్మన్ జనరల్‌స్టాఫ్ ఆఫీసరును ఖైదీగా పట్టుకున్నారు. అతడు జర్మన్ నాయకుల ప్లాన్‌ను బయటపెట్టాడు. దానిప్రకారం, జులై 10 వ తేదీనాటికి బొరిసోగ్లెస్క్, జులై 25 నాటికి స్టాలిన్‌గ్రాడ్, ఆగస్టు 10 కి సారటోవ్, ఆగస్టు 15 కి క్యుబిషేవ్, సెప్టెంబర్ 25 నాటికి బాకూ, ప్రవేశించి వీటిని స్వాధీనం చేసుకోవాలి. కాబట్టి, జూన్‌లో ప్రారంభమైన మూడవ జర్మన్‌దాడియొక్క ప్రధానోద్దేశ్యం మాస్కోపై తూర్పువైపు నుంచి పార్శ్వపుదాడిచేసి దాన్ని నాశనం గావించడమే. మనకు తెలిసిన సంగతు లన్నింటిని బట్టి, జర్మన్ల యుద్ధవ్యూహ మిదేనని రూఢి అవుతోంది.

రెండవరంగమే ఉన్నట్లయితే!

"మొదటి ప్రపంచయుద్ధంలో మాదిరి ఇప్పుడుకూడా యూరపులో రెండవరంగం తెరువబడిందనుకుందాం. దానివల్ల 60 జర్మన్ డివిజన్లు, (ఒక్కొక్క డివిజన్‌లో 10,000 మొదలు 20'000 వరకు సైనికులుంటారు.) 20 యితర డివిజన్లు, పశ్చిమ యూరపు రంగాలకు మళ్ళించబడ్డాయనుకుందాం. అప్పుడు జర్మన్ సేనల పరిస్థితి ఎంతో దుఃఖకరంగా ఉండేది. మన సోవియట్ సేనలుప్స్కోవ్, మిన్‌స్క్, జిటోమిర్, ఒడెస్సాల వరకు జర్మన్లను తరుమగలిగి యుండేవి. గత వేసవికాలంలోనే ఫాసిస్టుసేనల పతనం ప్రారంభమై యుండేది. యూరప్‌లో రెండవ రంగం లేకపోవడంవల్ల జర్మన్లు ఈ ప్రమాదాన్నుంచి రక్షించ బడ్డారు.... ఈజిప్టులో బ్రిటిష్ సేనలు సాగిస్తూన్న యుద్ధంవల్ల, 4 జర్మన్ డివిజన్లు, 11 ఇటాలియన్ డివిజన్లు, మాత్రమే ఈజిప్టు యుద్ధంలో చిక్కుకున్నాయి.

"మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీకి మొత్తం 220 డివిజన్లుండేవి. వాటిలో 85 డివిజన్లకంటె యెక్కువ రష్యాలో కేంద్రీకరించబడలేదు. అవిగాక 37 ఆస్ట్రియా - హంగేరీ డివిజన్లు, 3 బల్గేరియన్ డివిజన్లు, 3 టర్కిష్ డివిజన్లు కూడా ఉండేవి. కాని యీ సంవత్సరము సెప్టెంబరు నాటికి, ఆధార సహితమైన అంచనాల ప్రకారం జర్మనీకి గల 256 డివిజన్లలో 179 డివిజన్లు మన దేశంలోనే యుద్ధం చేస్తున్నాయి. ఇవిగాక 22 రుమేనియన్ డివిజన్లు, 14 ఫిన్నిష్ డివిజన్లు, 10 ఇటాలియన్ డివిజన్లు, 13 హంగేరియన్ డివిజన్లు, 1 స్లోవాక్ డివిజన్, 1 స్పానిష్ డివిజన్ మొత్తం 240 డివిజన్లు నేడు సోవియట్ సైన్యంతో పోరు సల్పుతున్నాయి.

పూర్వపు శత్రు దాడులు, ఇప్పటి శత్రు దాడి

"నేడు జర్మన్లు రష్యాపై గావించే దాడికి, నెపోలియన్ సేనలు గావించిన దాడికి యెట్టి పోలిక లేదు. నెపోలియన్ నాయకత్వం క్రింద 6 లక్షల సైన్యం రష్యాపై దండెత్తింది. ఇందులో 30,000 మొదలు 40,000 వరకు మాత్రమే బొరోడినో వరకు రాగలిగింది. నెపోలియన్ మాస్కోను సమీపించునప్పటి కతనివద్ద ఇంతే సైన్యం మిగిలింది. ఇప్పుడో సుమారు 30 లక్షల సైన్యం సోవియట్ సేనల కెదురుగా నిలబడింది. ఆధునిక యుద్ధసామగ్రి కూడా వారికి పుష్కలంగా వుంది.

మొదటి ప్రపంచయుద్ధంలో రష్యాపై జరిగిన దాడికి, నేడు జరుగుతూన్న దాడికి కూడా యెట్టిపోలికలేదు. మొదటి ప్రపంచయుద్ధంలో రెండవరంగం ఉండేది. కాని యిప్పుడో? రెండవరంగం లేకపోగా, అప్పటికంటె రెట్టింపు సైన్యం మనతో యుద్ధంచేస్తూ నిలబడింది.

సోవియట్ సైన్యంయొక్క కష్టాలు

కాబట్టి, నేడు మన సోవియట్ సైన్యాన్ని ఎదుర్కొంటూన్న కష్టా లెంత అసాధారణమైనవో, మీరిపు డూహించుకొన గలరు. ఫాసిస్టుదురాక్రమణదారుల్ని హతమార్చడానికి జరుగుతూన్న స్వాతంత్ర్య మహాసంగ్రామంలో సోవియట్ సైన్యం ప్రదర్శిస్తూన్న ధైర్యసాహసాలెంత కొనియాడదగినవో మీరిపుడర్థం చేసుకొనగలరు. ఫాసిస్టు జర్మనుహంతకులు, వారి మిత్రులు, గావించిన యీ తీవ్ర దండయాత్రను ఇంతవరకు ఏ యితరదేశం గాని, సైన్యంగాని, ఎదుర్కొని నిలబడలేదు.

రెండవరంగం తెరువబడుతుందా?

"అయితే, యూరప్‌లో ఇప్పుడైనా రెండవరంగం తెరువబడుతుందా?"

(వెనుకనుంచి ఒక ధ్వని "తప్పక తెరువబడుతుంది.")

"ఔను! తప్పక తెరువబడుతుంది." అని స్టాలిన్ తన ఉపన్యాసాన్ని యీ విధంగా సాగించాడు. "త్వరలోనే రెండవరంగం తెరువబడుతుంది. ఎందువల్లనంటే, అది మనకు మాత్రమే గాక మన మిత్రమండలికి కూడా అవసరం.

"ఫ్రాన్సు పతనమయిన తర్వాత ఫాసిస్టు జర్మనీని పడగొట్టడానికి రెండవరంగం తెరువబడక పోవడంవల్ల, స్వాతంత్ర్యాన్ని కాంక్షించే దేశాలన్నిటికి, ముఖ్యంగా మిత్రరాజ్యాలకు సహితం ముప్పువాటిల్లడం తప్పదనే సంగతిని వారు గ్రహించవలసియుంది.

"స్వాతంత్ర్యాన్ని కాంక్షించే దేశాలపై హిట్లరు యుద్ధపిశాచాన్ని వదలినప్పటినుంచీ ప్రపంచంలో రెండు పరస్పర వ్యతిరేక పక్షాలు యేర్పడ్డాయి. మొదటిది ఇటలీ - జర్మనీల పక్షం, రెండవది : సోవియట్ - బ్రిటన్ - అమెరికాల పక్షం. ఈ రెండుపక్షాలు ఒకదానితో ఒకటి ప్రత్యక్ష విరుద్ధమైన కార్యక్రమాలకై పనిచేస్తున్నాయనడం నిర్వివాదాంశము.

((మిగతా 10 వ పేజీలో)

ప్రజాశక్తి

11-11-42 బుధవారం

సోవియట్ యుద్ధ ఆశయాలు

రష్యా విప్లవం యొక్క 25 వ వార్షికోత్సవ సందర్భంలో కామ్రేడ్ స్టాలిన్ మాస్కో సోవియట్ సమావేశంలో గావించిన ఉపన్యాసం చదివితే, సోవియట్ యూనియన్ యే విధంగా ప్రపంచప్రజ లందరికీ నాయకత్వం వహించి జర్మన్ ఫాసిస్టులతో యుద్ధంచేస్తున్నదో స్పష్టమవుతూంది.

యూరపులో రెండవ యుద్ధరంగం తెరువబడనప్పటికీ సోవియట్ రష్యా యీ $1\frac{1}{2}$ సంవత్సరాలలోను ప్రదర్శించుతూన్న ధైర్య సాహసాలు, పట్టుదల ప్రపంచాన్నంతటినీ దిగ్భ్రమలో ముంచుతున్నాయి. "ఫాసిస్టు జర్మన్ హంతకులు, వారి మిత్రులు గావించిన యింత తీవ్ర దండయాత్రను యింతవర కే దేశంగాని, యే సైన్యంగాని యెదుర్కొని నిలబడలేద"ని కామ్రేడ్ స్టాలిన్ అన్నప్పుడు అందులో అతిశయోక్తి యేమాత్రం లేదు. అజేయమైనదని విర్రవీగే హిట్లర్ సైన్యం సోవియట్ భూమిపై అపార నష్టాలకు గురి అవుతోంది. సోవియట్ యూనియనును నాశనం చేసి ప్రపంచాధిపత్యం సంపాదించాలని హిట్లరు, వాని మిత్రులు వాంఛిస్తున్నారు. ప్రపంచ ప్రజలీ ప్రమాదాన్ని గుర్తించారు. తమ భవిష్యత్తును నిర్ణయించేది సోవియటు వీరులే నను సంగతి తెలుసుకొని, వారు రష్యాకు చేయగల సహాయాన్నంతటినీ చేస్తున్నారు. సోవియట్ ప్రభుత్వానికి కూడా యీ యథార్థం తెలుసు. కనుకనే ప్రతి యుద్ధ రంగంలోను సోవియట్ సైన్యం నాజీ పిశాచాల కెంత యెక్కువ నష్టం కలిగించాలో అంత నష్టం కలిగిస్తూంది. ఇందువల్లనే ప్రపంచ ప్రజలు సోవియట్ వీరులకు జోహారు లిస్తున్నారు.

యూరప్‌లో రెండవ యుద్ధరంగాన్నిగురించి కామ్రేడ్ స్టాలిన్ పలికిన పలుకులు మిత్రరాజ్యాల కొక వార్నింగ్, ప్రపంచ ప్రజలకొక హెచ్చరిక, అని చెప్పవచ్చు ఈ సంవత్సరం జూన్ మాసంలో బ్రిటన్- రష్యాల మధ్య జరిగిన ఆంగ్లో-సోవియట్ సంధి ప్రకారం, 1942 లో యూరప్‌లో రెండవ యుద్ధరంగం తెరువాలని నిశ్చయించబడింది. ఇది జరిగితే హిట్లర్ ఈ పాటికి పతనమయేవాడు. 1942 లో హిట్లర్ పరాజయం తప్పదని సోవియట్ నాయకులు పదేపదే గావించిన ప్రకటనల అర్థం యిదే. కాని, నేటి వరకు రెండవరంగం తెరువబడలేదు. 1942 వ సంవత్సరం ఆఖరు కావస్తుంది. సంధిశరతులను అమలుపరచడానికి సోవియట్ ప్రభుత్వం చేస్తూన్న కృషి, వారి నాయకుల రాజనీతిజ్ఞతను వెల్లడించుతుంది. రెండవ రంగం విషయమై జాగుచేస్తూన్న బ్రిటన్- అమెరికాలతో సంబంధం తెంచుకోవడమంటే అర్థం, హిట్లర్ కోరే పనిని చేసిపెట్టడమన్నమాట. ఏమీచేయక ఊరుకోవడమంటే అర్థం, సామ్రాజ్యవాదులకు లొంగిపోయి ప్రపంచ ప్రజలకు ద్రోహం చెయ్యడమన్నమాట. కనుకనే, కామ్రేడ్ స్టాలిన్ యిలా చెప్పాడు: "ఫ్రాన్సు పతనమయిన తర్వాత, ఫాసిస్టు జర్మనీని పడగొట్టడానికి రెండవరంగం తెరువబడక పోవడంవల్ల స్వాతంత్ర్యాన్ని కాంక్షించే దేశాలన్నింటికీ, ముఖ్యంగా మిత్రరాజ్యాలకు సహితం, ముప్పు వాటిల్లడం తప్పదనే సంగతిని వారు గ్రహించవలసియుంది." ఈ హెచ్చరిక మిత్రరాజ్యాల ప్రభుత్వాలకు మాత్రమేగాక, అచ్చటి ప్రజలకుకూడా ఉద్దేశించబడింది. సామ్రాజ్యవాదుల్ని జయప్రదంగా లొంగదీయగలిగినది ప్రజలశక్తి అని కామ్రేడ్ స్టాలిన్‌కు తెలుసు. వారిలో కామ్రేడ్ స్టాలిన్‌కి సంపూర్ణమైన విశ్వాసంవుంది. కనుకనే అతడు, "త్వరలోనే రెండవరంగం తెరువబడుతుంది" అని చెప్పాడు.

బానిస జాతుల భవిష్యత్తునుగురించి మిత్రరాజ్యాల ఆశయాలేవో కామ్రేడ్ స్టాలిన్ ఈ క్రింది కార్యక్రమాన్ని తెలియజేశాడు: "వేర్వేరు జాతుల మధ్య సమాన హోదా; వాటి సరిహద్దుల రక్షణ; బానిస జాతుల విమోచన; వారికి స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కు; తమకిష్టమైన పరిపాలనా విధానాన్ని యేర్పాటు చేసుకొనేహక్కు....." ఈ కార్యక్రమం ప్రపంచ పీడిత ప్రజలందరికీ వర్తిస్తుంది. ఆంధ్ర పత్రికలో ఈ భాగాన్ని తప్పుగా తర్జుమాచేశారు: "జర్మనీ, ఇటలీలకు బానిసరాజ్యములైన దేశములకు తిరిగి స్వాతంత్ర్యం ఇప్పించుట," అనివుంది. కాని, ఉపన్యాసం యొక్క మూలంలో 'Liberation of enslaved nations and the restoration of their sovereign rights' అని వుంది. ఆక్రమిత యూరప్‌లో ఫాసిస్టు నియంతల సంకెళ్ళలో బంధించబడిన దేశాల భవిష్యత్తును గురించి కామ్రేడ్ స్టాలిన్ ఈ ఉపన్యాసంలోనే మరొకచోట ఉదాహరించాడు. కాన, పైన పేర్కొనబడిన కార్యక్రమం ప్రపంచ బానిసజాతు లందరికీ వర్తిస్తుంది.

బానిసజాతుల విమోచనను గురించి, వారి కీయవలసిన స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కును గురించి, కామ్రేడ్ స్టాలిన్ అన్న మాటలు సామ్రాజ్యవాదుల గుండెలలో అప్పుడే పని చేస్తున్నాయి. "మెడ్రాస్ మెయిల్" పత్రిక వ్రాసిన వ్యాఖ్య యిందు కుదాహరణ. "బాల్టిక్ రాజ్యాలు సోవియట్ యూనియన్‌లో చేర్చబడాలని రష్యా యుద్ధానికి పూర్వం పట్టుపట్టింది. యుద్ధం పూర్తిఅయాక వాటి స్వతంత్ర రాజ్యాంగ నిర్మాణపు హక్కు తిరిగి యీయబడుతుందా? తమకే పరిపాలనా విధానం కావాలనికోరితే ఆ పరిపాలనా విధానానికి రష్యా అంగీకరిస్తుందా?" అని మెయిల్ పత్రిక వ్రాసింది. లాట్వియా, లిథువేనియా, ఇస్టోనియా అనే మూడు బాల్టిక్ రాజ్యాలు సోవియట్ యూనియన్‌లో చేరేముందు ఆ దేశాల ప్రజలు తమ తమ ప్రజా ప్రతినిధి సభలలో అంగీకారాన్ని ప్రకటించియున్నారు. ఈ విషయాన్ని మనం పత్రికలలో చదివే యున్నాం. 'మెడ్రాస్ మెయిల్' పత్రిక చేసే యీ అబద్ధపు ప్రచారం దాని సామ్రాజ్య తత్వాన్ని మాత్రమే తెలుపుతుంది.

బల్గేరియా రుమేనియా దేశాలు యిపుడు నాజీల కనుకూలంగా వున్నాయిగాన వాటికి స్వయం నిర్ణయాధికారం యివ్వరాదని కూడ మెయిల్ పత్రిక వ్రాసింది. నాజీ పరిపాలన స్థానే తమ పెత్తనంక్రింద వుండే ప్రభుత్వాలు స్థాపించబడాలని యీ బ్రిటిషు సామ్రాజ్యవాద పత్రిక అభిప్రాయం. స్టాలిన్ చెప్పిన యీ క్రింది వాక్యాలు యీ పత్రికకు సరియైన సమాధానం; "జర్మనీ దేశాన్ని నాశనం చేయడం మన ఉద్దేశ్యంకాదు........ జర్మనీని పరిపాలించే హిట్లరు కూటాన్ని నాశనం చేయడమే మన కర్తవ్యం." ఇలాగే బల్గేరియా, రుమేనియాలలో కూడ ఫాసిస్టు పాలక వర్గం నాశనం చేయబడాలి. కాని ప్రజలకు స్వయం నిర్ణయ హక్కునుయిచ్చితీరాలి. ప్రజలు తప్పక ప్రజాస్వామ్య పద్ధతినే - అది యే స్వరూపంలో వున్నప్పటికీ - తప్పక కోరుకుంటారు.

కామ్రేడ్ స్టాలిన్ బానిసదేశా లన్నిటి స్వాతంత్ర్యం కొరకు కృషిచేస్తున్నాడు. బానిస దేశాలలో భారత దేశంకూడ ఒకటి. దీని అర్థం స్టాలిన్ మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి ప్రసాదిస్తాడని కాదు. ప్రపంచ ప్రజ లందరితోను భారతీయులుకూడా చేయిచేయి కలిపి సోవియట్ యూనియన్ నాయకత్వాన పోరాడి, ప్రజాయుద్ధంలో విజయాన్ని సాధించాలి. అందుకై యుద్ధ నిర్వహణాన్ని ప్రజాయత్తం చేసికోవాలి; జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించుకోవాలి. సంపూర్ణ జాతీయైక్యత ఒక్కటే యిందుకు మార్గం.

బోల్షివిక్ పోటీ.

కామ్రేడ్స్!

నవంబరు విప్లవ దినోత్సవ ధన్యవాదాలు. నవంబరు దే కి యివ్వబడిన కోటాలను మించి ప్రజాశక్తి ప్రచారం వృద్ధి అయింది. ఐదు వేలు కోటా అయితే, ఆరువేలు పూర్తిచేయ గలిగారు. అందులకు కామ్రేడ్సుకు మా విప్లవాభి వందనాలు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, క్రిష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల కామ్రేడ్స్ ముఖ్యంగా అత్యుత్సాహంతో పని జేశారు. కొన్ని జిల్లాలు లెనిన్ దినోత్సవంనాటి కోటాలను కూడా దాదాపు యిపుడే పూర్తి జేశాయి. ఆ జిల్లాల కామ్రేడ్స్ యిదే విధంగా ద్విగుణీకృత ఉత్సాహంతో పనిజేయాలి. తమ జిల్లాలకు యెర్ర జెండా బహుమతి పొందడానికి కృషిచేయాలి. వెనుకబడిన జిల్లాల కామ్రేడ్స్ లెనిన్ దే నాటికైనా తమ కోటాలను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో పనిచేయాలి.

జిల్లాల పేర్లు	నవంబరు దే కోటా	నవంబరు 8 తేదీకి చేర్చించినవి			లెనిన్ దినోత్సవంనాటికి
		విడికాపీలు	చందాదార్లు	మొత్తం	
విశాఖపట్టణం.	200	117	14	131	300
తూర్పు గోదావరి.	300	465	39	504	500
పశ్చిమ గోదావరి.	500	295	254	549	1000
కృష్ణా.	1750	1021	998	2019	2500
గుంటూరు.	850	755	384	1139	1250
నెల్లూరు.	500	438	280	718	1000
కర్నూలు.	150	93	30	123	250
కడప.	100	40	15	55	200
అనంతపూర్.	100	40	20	60	200
చిత్తూరు.	100	60	30	90	300
ఇతర రాష్ట్రాలు.		531	81	612	
		3855	2145	6000	7500

బోల్షివిక్ అభివందనాలతో

రాష్ట్ర కమిటీ.

కులంగాడి అంత్యక్రియలు

[అభూతకల్పన]

కొడవటిగంటి కుటుంబరావు

పాపం! కులంగాడు చచ్చిపోయాడు. అమిత వృద్ధు. ఎంతో కాలం డాబుమీద కొట్టుకొచ్చాడు. తనకు జరామృతి లేదని ఎంతోమందిని జయప్రదంగా నమ్మించి తన గొయ్యి తనే తవ్వుకున్నాడు. - ఇవాళ వాడి శవం చివికి దుర్గంధం కొడుతున్నా, వాడికి అంత్యక్రియలు చేసేవాళ్ళు లేరు! వాడింకా యే మూలో ఉక్కుతునకల్లే తిరుగుతున్నట్టే నటిస్తున్నాడు. కులంగాడు బతికుండగా చేసిన పాపం యీవిధంగా వాడి శవం మీద పగ తీర్చుకుంటున్నదేమో!

నిజానికి కులంగాడిది వింత జీవితం. వాడు మొదటినించీ పరమ పాపి! అయితే యేం? ప్రపంచం వాడి కొకప్పుడెంతగా బ్రహ్మరథం పట్టింది! యేం వెలుగు వెలిగాడు - ఛండాలుడు! వాడిది సుగ్రీవాజ్ఞ! వాడి అధికారానికి తిరుగులేదు! వాడు చెప్పిందే వేదం! బ్రాహ్మణులు వాణ్ణి ప్రతిష్ఠించారు. వాడికి జరిగిన గౌరవ మర్యాదలూ, వాడికి చూపించిన వినయవిధేయతలూ, భయభక్తులూ మానవ జాతి మరెవరికీ చూపించలేదు.

వాణ్ణి ప్రతిష్ఠించిన బ్రాహ్మల ప్రభ అయిపోయినాకకూడా వాడి శకం అయిపోలేదు. మనుష్యులను శాసించటానికి అధికారంగా డొకడు వచ్చాడు - నిజమే. అధికారంగాడు తన ప్రభ కులంగాడి ప్రభకన్న ఎక్కువైనదని యెరుగును - అదీ నిజమే. కాని యెందుకట్లు అధికారంగాడు కులంగాడితో ఆపేతగూ పెట్టుకోలేదు. కులంగాడి పలుకుబడి చూసి అధికారంగాడు కూడా జంకాడనే చెప్పాలి. కులంగాడు అధికారంగాడి మీదికి పోక తన పరువు నిలబెట్టుకున్నాడు. ఈ యిద్దరూ యెదురైనప్పుడల్లా ఒకరికొకరు దూరంనించే అతిగౌరవంగాసలాము చేసుకొని యెవరి దారిన వారు వెళ్ళటంచూసి కులంగాడి ప్రభ యింకా ఉచ్చస్థితిలోనే వుందని భ్రమపడ్డారు. కులంగాడు దర్పానికి పోయి అధికారంగాడితో జట్టీ పెట్టుకునివుంటే కులంగాడి బండారం యెప్పుడో బయటపడి వుండును. కులంగాడికింకా చాలా మంచి రోజులు. మొత్తంమీద వాడు అద్భుత జాతకుడు!

కులంగాడింకా రొమ్ము విరచుకుని మీసాలకురంగు వేసుకుని తిరుగుతుండగానే అధికారంగాడి పటుత్వం ఉడిగిపోయింది. మనుష్యులను పాలించటానికి ధనంగా డొచ్చాడు.

ధనంగాడు పరమ కర్కోటకుడు. మానవ సహజమైన దౌర్బల్యాలేవీ వాడిలో లేవని మనోవైజ్ఞానికులు తేల్చారు. దయా, ఓర్పూ, ఆపేక్షా, భయమూ, విశ్వాసమూ, పశ్చాత్తాపమూ, గౌరవమూ- ఇటువంటి గుణాలకు వా డతీతుడు. కులంగాడు డాబుచేసీ, అధికారంగాడు అదలగొట్టీ, జనాన్ని పాలిస్తే, ధనంగాడు తన అలిఖిత శాసనాన్ని నిశ్శబ్దంగా నిష్కర్షగా పాలించాడు. ధనంగాడి శాసనం వాతపడే వరకూ ఎవరికీ అటువంటి శాసనం ఉందనే తెలియదు. ధనంగాడికి పబ్లిసిటీ అవసరంలేదు. వాడు అన్నివీథులూ తిరిగేవాడుకాదు. ముఖ్యమైన రాజవీథులలోనే తన ప్రభ వెలిగించాడు. వాడి సమగ్రస్వరూపాన్ని తనివిదీర చూసే అదృష్టం బహుకొద్దిమందికే దక్కింది.

వాడి నడవడిక ఒక కళచేశాడు. వాడి నాజూకూ, మరవరాని వాడి మందహాసమూ, వాడి నాగరికతా, శ్రావ్యమైన వాడి కంఠధ్వని, అతి మెత్తని వాడి సంభాషణ జనాన్ని ముగ్ధుల్నిచేసేది. వాడి కర్కశత్వాన్ని ఎవరూ పాటించేవారుకారు. వాడి దయ కోల్పోయి రాజవీథినుండి సందులలోకీ గొందులలోకీ తరుమబడినవాళ్ళు పైకి వాణ్ణి నానామాటలూ అన్నా లోలోపల వాడి పాలనకోసం తపించేవాళ్ళు ఎట్లాగైనా వాడి అనుగ్రహం సంపాదించి రాజవీథికెక్కటానికి, రాజవీథికి పొయ్యే సందులలో జనం కిటకిటలాడుతూ ఒకరినొకరు తోసుకునేవాళ్ళు, వాడి దర్శనం అయితే చాలునని ఒకర్ని వెనక్కి మరొకరు ముందుకు వచ్చే వాళ్ళు. ధనంగాడి కొరడాదెబ్బలనుకూడా ముందున్న వాళ్ళు లక్ష్యం చేసేవాళ్ళుకారు.

కులంగాడిమీద విశ్వాసంకొద్దీ కొట్లాది జనం తరతరాల అతి నీచమైన జీవితం జీవించారు. అధికారంగాడి కెదురాడలేక అనేకమంది అక్రమ శిక్షకు లోనై అవసరమైనప్పుడు ప్రాణత్యాగంకూడా చేశారు. కాని ధనంగాడి మహత్యం ఏమిటో వాడికోసం ప్రతి తీరంలోనూ అనేక కోట్లమంది మనస్ఫూర్తిగా బలి అయినారు. కేవలమూ వాడి అనుగ్రహం పొందలేకా, కోల్పోయీ ఆత్మ హత్యలు చేసుకున్నవాళ్ళ సంఖ్యే ఎంతో పెద్దది.

అయితే ధనంగాడు జాస్తిగా రాజవీథులలోనే తన పరిపాలన సాగించటం కులంగాడికి చాలా కలిసి వచ్చింది. అధిక సంఖ్యాకులైన జనం గల్లీలలోనూ, సందు గొందులలోనూ ఉండి ధనంగాడి మొహమైనా చూసిన పాపానఅయినా పోయినవారుకారు. (ధనంగాడి పరిపాలనలో ఈ సందులు జాస్తిగా విస్తరించి, పూర్వం ఎన్నడూ లేనంత అనారోగ్యకరంగా పరిణమించినట్టు రుజువయింది.) వృద్ధాప్యంలో కులంగాడు తన దర్జాయావత్తూ ఈ సందు గొందులలో వెలగబెట్టాడు. ఇక్కడఉండే ద్భౌర్భాగ్యులు, ఇంకా ప్రపంచాన్ని పాలిస్తున్నవాడుకులంగాడేననినమ్మారు ధనంగాడువట్టి పాపి అనీ, వాడి పరిపాలనలో ఇహం ఉందేమోగాని పరం బొత్తిగా లేదనీ, ఇహంకంటె పరమే చాలా ముఖ్యమనే విషయం నిస్సందేహమనీ కులంగాడు ప్రచారంచేసి జనాన్ని నమ్మించాడు. వీడి ప్రచారాన్ని నమ్మనివాళ్లున్నారు. ఈ సందులు గొందులు ఇంత అనారోగ్యకరంగా దుర్గంధపూరితంగా ఉంచినందుకు వారు కులంగాణ్ణి తప్పుపట్టారు. అందులో కొందరు ప్రాపంచిక సుఖం యావత్తూ రాజవీథులలోనే ఉందనికూడా గుర్తించారు. రాజవీథులలోకి పోవటానికి జీవితమంతా ధారపోసి విఫలులైనవాళ్ళూ, ధనంగాడి తడాఖా విని రాజవీథినించి పారిపోయి సందులలో నివసించటానికి వచ్చినవాళ్ళు కులంగాణ్ణి తెగపొగడి వాడి ప్రచారంలో తమ వృద్ధాప్యంగడిపి ధన్యులైనారు.

కులంగాడు మంచాన పడింది ఈ అనారోగ్యకరమైన సందులలో తిరగటంవల్లనే నని కొందరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఏమయితేనేం వాడికి వ్యాధి అంటుతుందని ఎవరూ విశ్వసించకపోవటంచేత వాడికి సరిఅయిన చికిత్స జరగలేదు. కాకపోయినా కాటికి కాళ్ళుచాచుకున్న వాడికి చికిత్స ఏమిటి? అయితే ధనంగాడి శకం కూడా అయిపోయినట్టు కనిపిస్తున్నది. ఎక్కడినించో ఒక బ్రహ్మాండమైన నీడ వచ్చి పడుతున్నది. దీని ప్రమాణం చూస్తే ఈ వచ్చే మనిషి మహారాక్షసుడి ప్రమాణం కలవాడల్లే కనిపిస్తుంది. ఈ నీడ చూస్తేనే ధనంగాడి గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నై. "ఆ వచ్చేభూతం మనల్నందర్నీ చదునుగా తొక్కేస్తుంది. దాని కాళ్ళకిందపడి మనం మన సంస్కారమూ, నాగరికతా, ప్రాణాలూ కోల్పోతాం!" అని ధనంగాడు కేకలు పెడుతున్నాడు.

ఎన్నడూ ధనంగాడి దయకు పాత్రులు కాని వాళ్ళు సయితం, లోపల యేమూలో నాడిపిన గౌరవం ఉండి యీ భూతాన్ని గురించి భయపడుతున్నారు. కాని కొంతమంది కురక్రాకారు యీ సందుల్లో జనాన్ని భయపడవద్దని హెచ్చరిస్తున్నారు.

"ఈ వచ్చే భూతం మన పీడలన్నీ విరుగుడు చేస్తుంది. రాజ వీథులూ, సందులూ యేకం చేస్తుంది. ఈ దిక్కుమాలిన సందులూ, దుర్గంధపూరితమైన యిళ్ళూ, నాశన మవుతాయని యేడుస్తారెందుకు? సంతోషించక! ఈ ధనంగాడి పరిపాలన అంతంచేసి యీ భూతానికి స్వాగతం యివ్వండి!"

"కాని మన కులంగాడి పరిపాలన పోతే మన గతి యేమిటి?" అని గొందుల్లోవాళ్ళు గోలెత్తుతున్నారు.

ఈలోపుగా కులంగాడి శరీరం కుళ్ళి దుర్వాసన కొడుతున్నది.

ప్రజల శక్తి చాటుదాం!

(1) కదన భూమి కేగుదాం - కత్తిదూసి దూకుదాం,
ఫాసిజాన్ని బాపుమాపి - ప్రజల శక్తి చాటుదాం ॥క॥
(2) తెగిన మొండె మరసినా - పడిన శిరసు గాంచినా,
అదురు బెదురు లేక ఇంక - ఎదురుతిరిగి గెల్చుదాం ॥క॥
(3) రక్తవాహి నీదుదాం - శత్రువులను జీల్చుదాం,
మృత్యువునకు వెరువమంచు-పోరి ముక్తి గాంచుదాం ॥క॥
(4) కత్తిమీద నారగుటో - కదనమందు గెల్చుటో,
భారతీయ శూరవటుల - గాథలంచు జాటుదాం ॥క॥
(5) హిందు ముస్లిం లైక్యమై - విజృంభించి పోరుదాం,
చీన, రష్య, దేశ ప్రజల - స్థాన మాక్రమించుదాం ॥క॥
(6) జాపానసగ నెంతరా - దాని తాహ తెంతరా,
అంతాగలిసి తంతేమళ్ళీ - అంతు దొరకేనంటరా ॥క॥
(7) జాపానువాణ్ణి జీల్చుదాం - ప్రమాదాన్ని దాటుదాం,
ప్రజలమంత గలసి దివ్య - సౌఖ్య మనుభవించుదాం ॥క॥
(8) సమర భూమి దూకుదాం - శత్రు శిరము నరుకుదాం,
జయ పతాకనెత్తుదాం - విజయ ఘోష బెట్టుదాం ॥క॥

— కామ్రేడ్ ముక్కామల నాగభూషణం.

మేల్కొలుపు

(శిధిలాలయమ్ములో.... వలె)

సమరాంగణమ్ములో జయము తేవోయి!
ఫాసిస్టులకు గ్రమింగ మెతుకు లేదోయి!
దేశదేశాల ప్రజలు
చేయిచేయీ కలిపి
స్వాతంత్ర్య సిద్ధికై
సాగి వస్తున్నారు-
భావిభారత స్వేచ్ఛకై కదలిపోవోయి!
ఫాసిస్టులకు 'గోరి' మిగులు నోయి!
ఊరూర ప్రజలు
ఉవ్వెత్తుగాపొంగి,
పోరాడ రణసీమ
కురికి వస్తున్నారు-
ముందు వెనుకలు జూడకే నడచిపోవోయి!
కోటాన కోట్ల ప్రజశక్తి గలదోయి
ఆయుధమ్ములు లేవ?
ఐకమత్యమె చాలు!
ఫాసిస్టుల కదియె
బలమైన గుండుదెబ్బ!
సమరాంగణమ్ములో జయము తేవోయి!
ఫాసిస్టులకు గ్రమింగ మెతుకు లేదోయి!

—కామ్రేడ్. నార్ల చిరంజీవి.

ఐక్యతా ఉద్యమంలో అనుభవాలు

మహిళాప్రచారకుల తీవ్రకృషి

కామ్రేడ్
కంభంపాటి సత్యనారాయణ

దేశమంతటా నవంబరు 1 నుండి 8 వరకు ఐక్యతావారం జరుపవలసిందని కామ్రేడ్ జోషీ అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ తరపున గావించిన హెచ్చరిక బెజవాడ కామ్రేడ్సును ఉత్సాహపరచింది. 44 గురు పార్టీ సభ్యులు, 25 గురు పార్టీ సహాయపరులు కలిసి మొత్తం 69 గురు 18 దళాలుగా యేర్పడ్డారు. ప్రతి దళానికి ఒక్కొక్క నిర్ణీత స్థలం యేర్పాటు చేయబడింది. కాంగ్రెసు నాయకుల్ని విడిచిపెట్టి, జాతీయ ప్రభుత్వం స్థాపించడానికి పూనుకోవలసిందని గవర్నర్ జనరల్‌కు ఒక మహజరు, కాంగ్రెసు నాయకులను సందర్శించి వారితో రాజీ చేసుకోవలసిందని మహమ్మదాలీ జిన్నాకొకవిజ్ఞాపన, భారత దేశంలో వున్న ప్రత్యేక జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించి, తక్షణమే జాతీయైక్యతకు పూనుకోవలసిందని కాంగ్రెసు నాయకులకొక హెచ్చరిక గల అచ్చు కాగితాలమీద సంతకాలు పెట్టించుతూ యింటింటికీ వెళ్ళి జాతీయైక్యత యొక్క ప్రాముఖ్యతను బోధించారు. బెజవాడలో 144 వ సెక్షను అమలులో వుండడంవల్ల మహజర్ల వుద్యమ మొక్కటే సాధ్యమయింది. ఈ మహజర్లతోబాటు రాష్ట్రకమిటీ అచ్చువేయించిన ఎర్ర జండాలు, ప్రజాశక్తి-పీపుల్సువార్ పత్రికలు కూడా అమ్మబడ్డాయి.

ఈ ఎనిమిది రోజులలో మొత్తం షుమారు 2000 మంది సంతకాలు చేశారు. జండాల అమ్మకంవల్ల, విరాళాలవల్ల రు. 268-10-10 వసూలయింది.

ప్రచారంలో అనుభవాలు

4 దళాలు కలిసి, మొదటి 5 రోజులలో సుమారు 1000 సంతకాలు చేయించారు. వీరిలో కార్మికులధికసంఖ్యాకులు. జాతీయైక్యతద్వారా సామ్రాజ్య వాదులపై బలమైన ఒత్తిడి కలుగజేసి, యుద్ధాన్ని ప్రజాయత్తం చేయడంద్వారా ఫాసిస్టు హంతకులను ప్రతిఘటించడమెంత అవసరమో బెజవాడ కార్మికులు సులభంగా అర్థంచేసుకున్నారు. మన దేశ స్వాతంత్ర్యానికీ, కార్మికవర్గం యొక్క విమోచనానికీ, ఇదెలా దారితీస్తుందో తెలుసుకున్నారు. ఈ 2000 సంతకాలలో 200 మంది మహమ్మదీయులు, ఒక ముస్లింలీగ్ సభ్యుడు, చాలామంది లీగ్ సానుభూతిపరులుకూడా విజ్ఞప్తులపై సంతకాలు చేశారు. పై 200 మంది మహమ్మదీయులలో 70 మంది జాతీయ వాదులు, 15 గురు పార్టీ సానుభూతి పరులు కూడా ఉన్నారు.

వీరు వెళ్ళిన ప్రదేశాలలో ఫార్వర్డుబ్లాక్ సభ్యులు ఈ వుద్యమాన్ని పూర్తిగా వ్యతిరేకించి, కమ్యూనిస్టులపై ప్రజలలో దుష్ప్రచారం సాగించారు. కాని, కామ్రేడ్స్‌యొక్క ఓపిక, పట్టుదల, ఉత్సాహం జయించాయి.

ఒక ముస్లింలీగ్ సభ్యుని అభ్యంతరాలు

మరొక దళం ఒక ముస్లింలీగ్ సభ్యుని వద్దకు వెళ్ళింది. జిన్నాకు చేయబడిన విజ్ఞప్తిలో అతడు సంతకం చేశాడు. కాని కాంగ్రెసునాయకుల విడుదలను కోరే మహజరుపై సంతకం పెట్ట నిరాకరించాడు. అత డొకసారి ఒరంపురం వెళ్ళాడట, అక్కడెవరూ భోజనం పెట్టలేదట. హోటలులో కూడా భోజనం లభించింది కాదట. ఆఖరికి ఆ పట్నంలో మంగలి కూడా యితనికి క్షౌరం చేయలేదట. ఇందువల్ల హిందువులందరు యింతేనని అతడొక నిశ్చయానికి వచ్చాడు. కాంగ్రెసు నాయకుల విడుదలకై కృషిచేస్తే, హిందువుల రాజ్యం వస్తుందనీ, మహమ్మదీయుల హక్కులు నాశనమవుతాయనీ, అతడు వాదించాడు. కాని, అతనివద్దకు వెళ్ళిన ప్రచారకులు యిదెలా సాధ్యంకాదో, నిరంకుశ పద్ధతులకు క్రమక్రమంగా స్థానం లేకుండా ఎలా పోతున్నదో, వివరించి చెప్పారు. ముస్లింలీగ్, కాంగ్రెసు, ఐక్యంకాకపోతే హిందువులు, మహమ్మదీయులు కూడా జపాను ఫాసిస్టుల యినుప సంకెళ్ళలో ఎలా పడతారో వివరించారు. కాని ఆ లీగ్ సభ్యుడు కాంగ్రెసును వ్యతిరేకించడం మానలేదు. రెండుజండాలుమాత్రం కొన్నాడు.

మరొక దళం ఒక మార్వాడీ కొట్టువద్దకు వెళ్ళి, సంతకాలు పెట్టవలసిందని కోరితే, కస్సుబుస్సులాడి, జపాన్ మనకు శత్రువెలాగు? ఇలాంటి మాటలు చెపితే జాగ్రత్త! అని కసిరికొట్టాడు. జపాన్ యొక్క దురంతాలను గురించి ఎన్నివివరాలు చెప్పినా, అతడు వినలేదు.

మరొకచోట ఒక జపాన్ అనుకూలవాది కొంతమందితోకలిసి బాతాఖానీ కొడుతున్నాడు. ఐక్యతా ప్రచారం కొరకు వెళ్ళిన ఒక కామ్రేడ్ ఆ ముఠాలో కూర్చున్నాడు. టోకియో రేడియోను గురించి అతడు ఉత్సాహంతో ఉపన్యాసధోరణిని ప్రారంభించాడు. అంతా విన్న తరువాత, మన కామ్రేడ్ చైనాలో జపాన్ చేసిన క్రూరకృత్యాలు, మలయా - బర్మాలలో చేస్తున్న అత్యాచారాలు, వర్ణించాడు. ఆ ఉపన్యాసకుడు ఏమీ జవాబుచెప్పలేక, అందరి యెదుట ఎంతో చిన్న మొగం చేసుకొని, పలాయన మంత్రం పఠించాడు.

వర్తకులు

ఇక వర్తకుల సంగతి. తండ్రి యింట్లో లేడని కొడుకు, కొడుకు యింట్లో లేడని తండ్రి- ఈవిధంగా ఎవరో ఒకరు యింట్లో లేరని అధిక సంఖ్యాకులు సంతకాలు చేయలేదు. ఒక వర్తకుడుమాత్రం సంతకంచేశాడు. ఎందువల్లనంటే తాను కాంగ్రెసు నాయకుల విడుదలను కోరుతున్నాడట. కాని, విరాళం, ఒక్క కానీకూడా యివ్వనన్నాడు. కారణం, ఈ ఉద్యమం కమ్యూనిస్టుపార్టీచే ప్రారంభింపబడింది; కమ్యూనిస్టులు తనకు బద్ధశత్రువులు. నిజమేమరి, బెజవాడ వర్తకులు ధరలకంట్రోలును అమలు పరచకుండా గావించే కుతంత్రాలను కమ్యూనిస్టులు ప్రతిరోజు ప్రజలయెదుట బట్టబయలు చేస్తూంటే, ఈవర్తకుడు కమ్యూనిస్టులకు దబ్బిస్తాడా?

షర్టులు వగైరా వివిధసైజులలో కుట్టిఅమ్మే ఒక యజమాని ప్రచారకుల్ని అనేక ప్రశ్నలు వేశాడు. కమ్యూనిస్టులు యుద్ధ ప్రయత్నాల కనుకూలంగా పనిచేయడంవల్ల సామ్రాజ్య వాదానికి బలం కలుగజేస్తున్నారనీ, కమ్యూనిస్టులు నేడవలంబిస్తూన్న పంథా దేశానికి నాశనకారి అనీ, అతడు వాదించాడు. కాని మన కామ్రేడ్సు జాతీయైక్యతద్వారా సామ్రాజ్య వాదాన్ని ఘులా లొంగదీయగలమో, విధ్వంసక్రియలు ఫాసిస్టుల కెలాగు సహాయపడుతున్నాయో, స్పష్టీకరించారు. ఒక గంటసేపు చర్చించిన తర్వాత అతడు కమ్యూనిస్టుల పంథాను అంగీకరించి, 1 జండా, 1 పీపుల్సు వార్ పత్రికను కొన్నాడు.

ఒక డాక్టర్

ప్రఖ్యాతిగన్న ఒక డాక్టరువద్దకు వెళ్ళితే, అతడు మరొకడాక్టరు సంతకమేదైనఉన్నదో, లేదో చూచి, ఉన్నదికాబట్టి తానుకూడా సంతకం చేశాడు. ఒక ఫొటో ఆర్టిస్టు, కాంగ్రెసు భక్తుడైన ఒక ప్రెస్, యజమాని కొడుకు, ప్రచారకులయెదుట దూషణవాక్యాలు ప్రయోగించాడు.

స్త్రీల ప్రచారక దళాలు

పురుషులతో సమానమైన పట్టుదల, ఉత్సాహము, స్త్రీలుకూడా ప్రదర్శించారు. జపాన్ దండయాత్ర భారతదేశానికికూడా వస్తే స్త్రీలు-శిశువులు ఎన్ని అవమానాలకు, ఎన్ని క్రూరకృత్యాలకు, గురి కావలసివస్తుందో, వీరికి తెలుసు. కనుకనే ఐక్యతా వుద్యమాన్ని గురించి కామ్రేడ్ జోషీ యిచ్చిన ఆదేశానుసారం 12 గురు స్త్రీలు 4 దళాలుగా యేర్పడి ఉదయం మొదలు సాయంత్రంవరకు ఇంటింటికి వెళ్ళి ఐక్యతా సందేశాన్ని ప్రచారం గావిస్తున్నారు. మొదటి 5 రోజుల్లో వీరు సుమారు 600 సంతకాలు తీసుకున్నారు. దాదాపు రు 100 వసూలు చేశారు.

వీరిలో కొందరు పిల్లల తల్లులు. చంక విడువని పసిపిల్లల్ని ఉదయం 7 గంటలకు లేపి ఒక చేతితో వారి నెత్తుకొని, మరొక చేతితో సంతకాల కాగితాలు, జండాలు, సీనా రేకు డబ్బాలు (హుండీలు) పుచ్చుకొని, జట్లు జట్లుగా వీధులలో నడుస్తూంటే వారి ఉత్సాహాన్ని, పట్టుదలను చూచి ఆశ్చర్యపడనివారు లేరు.

మధ్య తరగతి విద్యాధికులు, లాయర్లు, డాక్టర్లు, ఆఫీసర్లు విశేషంగా వున్న వీధులు వీరి కీయబడ్డాయి.

కొందరు విద్యాధికులు

ఈ ఐక్యతా ఉద్యమానికీ, అరాజకోద్యమానికీ కొద్దో గొప్పో సంబంధ మున్నదని భ్రమపడ్డారు."విద్యాధికులు"కొందరు; దీనికీ, దానికీ యెట్టి సంబంధము లేదనీ, అరాజకోద్యమంవల్ల ఒక బానిస యజమాని పోయి మరొక బానిస యజమాని వస్తాడనీ, యీ ఐక్యతా ఉద్యమంవల్ల ఒకేసారి యిద్దరినీ దెబ్బతీయగలమనీ, మన మహిళా కామ్రేడ్సు అట్టివారికి తెలియజెప్పారు. చాలామంది కాంగ్రెసు, జపానుకు విరోధి కాదని వాదించసాగారు. జపాను వస్తే భారతీయులు సుఖసంపదలతో తులతూగవచ్చుననీ, జపాను వ్యతిరేక ప్రచారం మంచిది కాదనీ వారి అభిప్రాయం. కాని మహిళా కామ్రేడ్సు యీ భావాన్ని తొలగించడానికి ప్రతిరోజు వాదప్రతివాదాలు చేస్తున్నారు. కాంగ్రెసు ఫాసిస్టువ్యతిరేక సంస్థఅనీ, గాంధీజీ మిత్రరాజ్యాలకే అనుకూలుడనీ రుజువుపరచడానికి కాంగ్రెసు తీర్మానాలు, గాంధీజీవ్యాసాలు చూపుతున్నారు. ప్రభుత్వ నిర్బంధవిధానం యొక్క ఫలితంగా విద్యాధికులు సహితం యే విధంగా దుష్ప్రచారానికి గురి అవుతున్నారో ఈ ప్రచారంలో బోధపడింది. ప్రజలలో ఇట్టి అపోహలు పోగొట్టి ఫాసిస్టు వ్యతిరేక భావాలు కలిగించడానికి నిర్బంధవిధానం విరమించడమెంత అవసరమో మన కామ్రేడ్సు తెలుసుకొని, ఐక్యతా ఉద్యమంలో మరింత తీవ్రంగా పాల్గొంటున్నారు.

ఈ సంతకాలపై మరేదో వ్రాసి పంపుతారేమోనని మరొక "విద్యాధికుడ"న్నాడు. ప్రజల్ని అవిధంగా దగా చేయడానికి తాము రాలేదనీ, ఇష్టం లేకపోతే చెయ్యనవసరం లేదనీ, స్త్రీ ప్రచారకులు ప్రశాంతంగా జవాబు చెప్పారు. అప్పటికిమాత్ర మతడు సంతకం చేయలేదు. కాని, మర్నాడు చేశాడు. ఈ మహజర్లు స్టాలిన్‌కూ, జంగ్-కై-షేక్‌కూ, పంపుతారట కాదా? అని పేరుగన్న ఒక అడ్వకేట్ ప్రశ్నించాడు. ఇది వట్టి అబద్ధమనీ, ప్రజల్ని తాము ఈ రోజున మోసంచేస్తే, తిరిగి మరొక రోజున యెట్లు రాగలము? అని ప్రచారకులు అడిగారు. వెంటనే అతడు సంతకంచేసి, ఒక రూపాయ చందా యిచ్చాడు.

మరొక కాంగ్రెసు భక్తుడు "అసలు దేశంలో ప్రభుత్వమే లేనప్పుడు విజ్ఞప్తిచేయడ మెవరికి" అని ప్రశ్నించాడు. నిజంగా ప్రభుత్వమే లేకపోతే యీ ఆరాజకచర్య లెవరిపైన? అని మన ప్రచారకులు తిరిగి ప్రశ్నించారు. జవాబేమీ చెప్పలేక అతడు వెళ్ళిపోయాడు. ఈ సంతకాలవల్ల ప్రభుత్వమేమీలొంగదనీ, బలవంతంగా కూలద్రోయాలనీ, మరొక జాతీయవాది వాదించాడు. గత 60 సంవత్సరాల నుంచీ కాంగ్రెసు జాతీయోద్యమాన్ని నడుపుతున్నప్పటికీ, ప్రయోజనమేమి లేనేలేదా?" అని ప్రచారకులు తిరిగి జవాబు చెప్పారు. కాని అతడు సంతకం చేయలేదు. ఒక హిందూ మహాసభ నాయకుడు కాంగ్రెసునాయకుల విడుదలకై సంతకంచేశాడు. కాని, జిన్నా-ముస్లిం లీగ్‌లు యితనికిశత్రువులు. అందువల్ల అవిజ్ఞప్తులపై సంతకాలు చేయలేదు. ఒక రాడికల్ పార్టీ సభ్యుడు కాంగ్రెసునాయకుల విడుదలకై సంతకంమాత్రం చేసి, పార్టీ డిసిప్లిన్ కొరకు చందా యేమీ యివ్వనని మొదట నిరాకరించి, తర్వాత కొంతచందా యిచ్చాడు; ఇది కమ్యూనిస్టుల ఉద్యమమనీ, వారు అచ్చువేసిన విజ్ఞప్తులపై సంతకంచేసి కమ్యూనిస్టుపార్టీని బలపరచ దలచుకొనలేదనీ, యిద్దరు వ్యతిరేకులు కఠినంగా జవాబుచెప్పి వెళ్ళిపోయారు.

ఇంత వ్యతిరేకత, దుష్ప్రచారం, ప్రజలలోవ్యాపించి యున్నప్పటికీ, ప్రచారకులు ఓపికతోను, ఉత్సాహంతోను, ఐక్యతా ఉద్యమాన్ని వృద్ధిచేస్తున్నారు. సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానంవల్ల ప్రజలలో ఎంత ఫాసిస్టు అనుకూలభావం వ్యాపించుతూందో వారు కళ్లారా చూస్తున్నారు. దీన్ని తొలగించడానికి జాతీయైక్యతా ఉద్యమంలో విరివిగా పనిచేస్తున్నారు.

రష్యావిప్లవదినోత్సవం

25 వ రష్యన్ విప్లవ దినోత్సవ సందర్భములో అఖిల భారత కమ్యూనిస్టు పార్టీయొక్క ఆంధ్ర కమిటీ యాజమాన్యాన 7-11-42 వ తేదీ సాయంకాలం బెజవాడ గాంధీపార్కులో బహిరంగ సభ జరిగింది. కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ అధ్యక్షుడు; కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు ఉపన్యాసకుడు. సభలో యేకగ్రీవంగా ఆమోదించబడిన తీర్మానానుసారం ఫాసిస్టు హంతకులతో హోరాహోరిగా యుద్ధం చేస్తూన్న సోవియట్ వీరులకు అభివందనాలర్పించబడ్డాయి. సోవియట్ ప్రజలవలె భారతీయులు కూడా సంపూర్ణ జాతీయైక్యతకై కృషి సల్పి, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించుకొని, ఫాసిస్టు పిశాచాల నాశనానికి పోరు సల్పడానికి సంసిద్ధత ప్రకటించబడింది. కాంగ్రెసు నాయకుల్ని వెంటనే విడుదల చేసి, జాతీయ ప్రభుత్వ స్థాపనకు పూనుకోవలసిందని యిండియా ప్రభుత్వానికి హెచ్చరిక గావించబడింది.

రాష్ట్రం నలుమూలలనుండి వర్తకుల లాభాల దోపిడిని గురించి వార్తలు వస్తున్నాయి. రైతులు, కూలీలు, చిన్నచిన్న దుకాణాదార్లు, ఉద్యోగులు, ఒకరేమిటి, సామాన్య ఆదాయం కలవారంతాహాహా కారాలు చేస్తున్నారు. అయితే ప్రయోజనం? షాహుకార్లదోపిడి, స్థానికప్రభుత్వోద్యోగుల ఉదాసీనత మాత్రం యథాతథంగానేఉన్నాయి. పైగా'లాఅర్డరుల'కాపాడు బాధ్యతకల్గిన ఉద్యోగిబృందము మేమేమీ చేయలేము "అని కూడా అక్కడక్కడ నీళ్ళు నములుతూవున్నారు. దాని ఫలితంగా షాహుకార్లు బహిరంగంగా దోపిడీ సాగించారు.

బెజవాడ యువజన సంఘంవారు ఒక కరపత్రంలో వ్రాస్తూ చవుకధరలడిపోలు పెట్టినందులకుగాను షాహుకార్లు తమ దుకాణాలలో కొనే సరకులపై 'కరువు పన్ను' అని నూటికి 0-4-0 చొ॥ వసూలు చేస్తున్నారని తెల్పారు. ఒక్క నెలలోనే రు 1001 ల పైగా షాహుకార్లు 'కరువుపన్ను'ను వసూలు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాధికారులు దీనికి ఫిర్యాదుచేసినా చూస్తూ వూరుకున్నారు.

వెంకటగిరి

వెంకటగిరిలోకూడాయువజనసంఘంవారు డిప్యూటీ కలెక్టరువద్దకు రాయబారం వెడలి అధికధరల లాభాలను అరికట్టమని కోరారు. నిర్మాణయుక్తమైన సూచనల్నికూడా చేశారు. చౌకధరలడిపోలను ప్రభుత్వాన్నే పెట్టించమన్నారు. మనిషికి ఇంత అని చెప్పి ఇచ్చే రేషనింగు పద్ధతిని పెట్టమన్నారు. ప్రజా ప్రతినిధులు గల ధరల కంట్రోలు కమిటీలను నియమించి, ధరలను కంట్రోలు చేయుట, ఎగుమతి, దిగుమతులను కంట్రోలు చేయుట ఆ కమిటీకి స్వాధీనపర్చమన్నారు. డిప్యూటీ కలెక్టరు మరునాడు వర్తకులను, యువజన సంఘ ప్రతినిధులను పిల్చి కంట్రోలు ధరల కెక్కువకు అమ్మినా, సరకును నిల్వజేసినా శిక్షిస్తాననీ, సరుకును దిగుమతిచేసే ప్రయత్నాలను చేస్తాననీ, యువజన వాలంటీర్లు దుకాణాలవద్ద కాపలా వుండవలసిందనీ తెల్పాడు. యువజన సంఘం అంగీకరించింది.

అనంతపురం

దేశంలో నిర్బంధ విధాన జ్వాల విద్యార్థి లోకాన్ని యెక్కువగా దహిస్తోంది. విద్యార్థి ఉద్యమాన్నే యీ నిర్బంధ విధానం నాశనం జేయ పూనుకుంది. ముఖ్యముగా ఈ పిడుగు అనంతపురం విద్యార్థి మీద పడ్డది. ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి దీన్ని గూర్చి యిలా వ్రాస్తున్నారు: "అనంతపురంలో విద్యార్థులపై పెట్టబడిన కేసులో సాక్ష్యానికై పోలీసులు విద్యార్థులనేకులను భయపెట్టుతున్నారు. బుజ్జగిస్తున్నారు, కాని యింతవరకు విద్యార్థులీవత్తిడికి లొంగలేదు. అంతటితో ఆగక యీ కేసు విచారణకై స్పెషలు కోర్టును యేర్పరచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తున్నది. స్పెషల్‌కోర్టు తీర్పుపై అప్పీలు కూడా వుండదు. ఈ విధంగా అనంతపూర్ విద్యార్థి ఉద్యమం విచ్ఛిన్నమౌతోంది. ఆంధ్ర విద్యార్థులు దీన్ని సాగనివ్వరాదు. వెంటనే విద్యార్థుల నందరిని విడుదల చేయాలని మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు పంపాలి. వ్యవధిలేదు. కానత్వరపడండి."

రేపల్లె

ఇదివరకే యీ ఆందోళన ప్రారంభమైంది. రేపల్లె విద్యార్థిసంఘం ది 29—10—42 న సమావేశమై అనంతపూర్ విద్యార్థుల ఆదర్శకృషిని అభినందిస్తూ వారి నాయకుల్ని అరెస్టుచేసినందుకు అసమ్మతి తెలుపుతూ వారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ తీర్మానించింది. కయ్యూరు కామ్రేడ్సుమీద వున్న వురిశిక్షలను కూడా రద్దుచేయ వైస్రాయిని కోరుతూ తీర్మానించింది. బెజవాడ విద్యార్థిసంఘం 26-10-42 న సమావేశమై అనంతపురం విద్యార్థులను వెంటనే విడుదలచేయాలనీ, ప్రిన్సిపాల్ వారిని కాలేజీనుండి వెళ్ళగొట్టుట, జరిమానాలు వేయుట అక్రమమనీ, వెంటనే వాటిని రద్దుచేయాలనీకోరుతూ తీర్మానించింది.

పందిళ్ళపల్లిలో 26—10—42 న గ్రామ యువజన సంఘుఆధ్వర్యాన 'మాతృభూమి' 'కొరియాస్వాతంత్ర్య పోరాటం' 'గెరిల్లాలు' అను నాటకాలు ప్రదర్శింప బడెను. ప్రజలు ఆబాలగోపాలం 700 మందికి పైగా వచ్చారు. గెరిల్లాల చాతుర్యానికి ఆశ్చర్యము, జపాన్ క్రౌర్యాలకు ద్వేషము, స్వాతంత్ర్య వీరుల త్యాగానికి కరుణ చూపుతూ తరచు జయజయ ధ్వనులు చేశారు. ఇటువంటి నాటకాలు యింకా యెక్కువ కావాలని కోరారు. జపాను ఫాసిస్టు దౌర్జన్యాలను నాశనం చేయుటకై తాముకూడా సిద్ధం కావాలనే భావాలతో యిండ్లకు మరిలారు.

యుద్ధంలో జయాపజయాలు సైనికులపై యెంత ఆధారపడి వుంటాయో కార్మికులపై కూడా అంతగా ఆధారపడివుంటాయి. కూలీల ప్రాధాన్యత సామాన్యులకు గోచరించదు. కాని యుద్ధరంగం వెనుక విజయ సాధనాల నన్నిటినీ తయారుచేసే శక్తి కార్మిక వర్గమే అని అనుభవజ్ఞులకు తెలుసు. కాని యీ సామాన్య సూత్రాన్ని, యీ ప్రధాన సత్యాన్ని ప్రభుత్వోద్యోగులు గుర్తించలేకపోతున్నారంటే ఆశ్చర్యమే కాక విచారం కూడా కల్గుతుంది.

రాజమండ్రి

రాజమండ్రి రోళ్ళ పనివారలలో పనిజేసే కామ్రేడ్ అంబళ్ళ అప్పలస్వామినీ, మరి నల్గురు కూలీలను 27—10—42 రాత్రి కారణాలు చెప్పకుండానే పోలీసులు లాక్కుపోయారు. పోలీసు స్టేషనుకు వెళ్ళిన తర్వాత వీరిని నానా బూతులూ తిట్టి రక్తం వచ్చేటట్లు దారుణంగా కొట్టారు. ఎందుకో దేవుడికే తెలియాలి.

వివిధవార్తలు

ఆరాత్రల్లా తిండిగూడా పెట్టక మరునాడు మధ్యాహ్నం వదలిపెట్టారు.

ట్రేడ్ యూనియన్ వర్కరు జామి సన్యాసిరావు సంచి పుచ్చుకొని బజారు వెళ్ళుతూవుంటే, పోలీసు సబ్ యిన్‌స్పెక్టరు వచ్చి సంచిని సోదా జేశాడు. ఏమన్నా ఉంటేగా దొరకటానికి. "ఏమైనా కాగితాలేసు కొని అరెస్టు కాకపోయినావ్!" అని ఆక్షేపిస్తూ ఆ యినస్పెక్టరు వెళ్ళిపోయాడు.

రాజమండ్రి పేపరు మిల్లు తిరిగి పనిచేస్తూవుంది. పూర్వం పనినుండి మాన్పబడ్డ కూలీలలో 109 మంది యింకా మిగిలిపోయారు. వారి అందరి విషయం మెమోరాండం రూపకంగా తయారు జేయటానికిగాను పేపరు మిల్లు వర్కర్సు యూనియన్ కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి వర్కింగ్ కమిటీని సమావేశపర్చుటకు నోటీసు యిచ్చాడు. మిల్లు మేనేజరు యీ వార్తను తెలుసుకొని కృష్ణమూర్తిగార్ని డిస్మిస్ చేశాడు. యూనియన్ అంటే యింత బెదురు యెందుకో?

రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి బ్రాంచి సభ 31-10-42 న జరిగింది. కరువుభత్యాలు, రేషనుఅలవెన్సు ముఖ్యవిషయాలనుగూర్చి ఉపన్యాసాలివ్వబడెను. పిమ్మట ఈ క్రింది తీర్మానాలు చేయబడెను.

"రూ 150/- వరకు జీతంతీస్తున్న పనివారలవరకు యుద్ధ భత్యాలు, జోనల్ పద్ధతి రద్దుచేసి అందరికి సమానంగా యుద్ధభత్యాలు ఇవ్వాలనియు, జాతివివక్షత లేకుండా అందరికి రు 22-8-0 చొ॥ రేషన్ అలవెన్సు యివ్వాలనియు, పనిలో ప్రవేశించుకాలం 7 గంటల నుండి కాక 8 గంటలనుండి పెట్టాలనియు, రైల్వే పరిసరాలలో పనివారల మీటింగులు పెట్టుకొనుటకు అధికారం రైల్వే అధికారులు ఇవ్వాలనియు, అన్ని డిపార్టుమెంటులకు చెందిన పనివారల యిబ్బందులపై రెండు మాసాల కొకతూరి కరపత్రము ప్రకటించుటకు తీర్మానింపబడెను."

మునగాల

రైతులోకంకూడా మేల్కొన్నది. మునగాల రైతులు- జమీందారు చేసుకున్న ఒడంబడిక షరతుల ప్రకారం జమీందారు ఏమిన్ని చేయలేదు. ఒడంబడికను అమలుపర్చుటకుగాను జమీందారు ప్రతినిధులు ఇద్దరు, రైతుసంఘ ప్రతినిధులు ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధి ఒకరు కలిసి ఒక కమిటీని నియమించాలి అన్న కలెక్టరుసూచనను జమీందారు అంగీకరించలేదు. పైగా ఒడంబడికయే లిమిటేషన్ పట్టినదనే వింత వాదనను బయలుదేరదీశాడు. కాబట్టి రైతు లందరి తరపున రైతుసంఘం జమీందారుపై దావావేసినది. రైతుల అనాదిసిద్ధమగు హక్కులకు జమీందారు భంగం కల్గజేయుచున్నారు. కాబట్టి అట్లు చేయనీయకుండా ఇంజంక్షను నిప్పించమని దావాలోనివిషయం.

బెజవాడ రైతుసంఘం

బెజవాడ తాలూకా రైతుసంఘం వర్కింగుకమిటీ మీటింగు ది 25-10-42 న జరిగింది. ప్రతివర్కింగు కమిటీసభ్యుడున్ను ఫిర్కా రైతు సభలు ప్రతి నెలా జర్పుటకున్ను, హెచ్చరింపబడ్డారు. ప్రతి ఫిర్కాలోను కనీసం 600 మందిని రైతుసంఘ సభ్యులుగా జేర్పాలని నిర్ణయించబడింది. మరొక తీర్మానంలో 'నేడు దేశములో చెలరేగిన అశాంతి పరిస్థితులను చక్కబరిచి రానున్న ఫాసిస్టుదాడి నెదుర్కొనుటకు జాతీయ ప్రభుత్వ మత్యంతావసరము. జాతీయైక్యత లేనిది జాతీయ ప్రభుత్వము రానేరదు. ఇందుకుగాను భారత కమ్యూనిస్టుపార్టీ నవంబరు 1 నుండి జాతీయైక్యతావారము చేయవలసినదిగాచేసిన అప్పీలు సరియైనమార్గమని ఈ సభవారు గుర్తించుచున్నారు. ఆ వారములో జాతీయైక్యతావారము దిగ్విజయముగా కొనసాగించుటకు కమ్యూనిస్టుపార్టీ వారికి తోడ్పడగలందులకు ఈ సభవారు కోరుచున్నారు' అని ప్రజలకు హెచ్చరిక చేయబడింది.

ఏజన్సీ ప్రాంతాలలో జంతుభయం చాల ఎక్కువ. సస్యములన్నీ జంతువులచే ధ్వంసం చేయబడుతాయి. పైగా ఈ అడవుల్లో కాపురముండే వారి యిళ్ళుకూడా ఒకదాని కొకటి సంబంధం లేక దూరదూరంగా వుంటాయి. అందుకై ఏజన్సీ వాసులకు కేపు తుపాకులు యివ్వబడుతాయి. లైసెన్సు లేకుండాకూడా ఈ తుపాకులను వారు ఉపయోగించుకోవచ్చును. కాని ఇటీవలి దేశ పరిస్థితుల బెడద ఏజన్సీవాసులకుకూడా కొట్టింది. ప్రభుత్వం ఆ తుపాకులనన్నిటినీ స్వాధీనపర్చుకొని పోలీసు ఠాణాలో భద్రపరిచింది. ఇంక ఏజన్సీ వాసులకు, వారి సస్యాలకు క్రూరమృగాల బాధనుండి రక్షించుకుంటానికి గతియేది?

కాంగ్రెస్ వాదుల కొక హెచ్చరిక

కామ్రేడ్
మద్దుకూరి చంద్రశేఖరరావు

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘం బోసుముఠా చేతులలో పడుతోంది

ఆంధ్ర దేశంలో కాంగ్రెసు రాజకీయాలు క్రమ క్రమంగా ఫార్వర్డు బ్లాకు అడుసులోకి క్రుంగి పోతున్నాయి. కాంగ్రెసు పలుకుబడి, ఆర్గనైజేషను జపాను దురాక్రమణదారుల ఏజెంట్లుగానే పనిజేస్తున్న బోసుముఠావారి చేతులలో పడిపోతూంది. గాంధి జన్మ దినోత్సవ సందర్భంలో రాష్ట్రకాంగ్రెసు పేరున ప్రకటించబడిన కరపత్రంలో 'బాంకాక్' 'సైగాన్' వగైరాజపాన్ ఆక్రమిత ప్రదేశాలనుండి వెలువడే రేడియోలను వినమని, మీటర్లు తెలియ జేయుటే యిందుకు చక్కని ఉదాహరణ.

1936 లో జవ్హార్‌లాల్ నెహ్రూ అధ్యక్షతను లక్నోలో జరిగిన కాంగ్రెసు మహాసభ ఫాసిజానికి వ్యతిరేకతను ప్రకటించింది. నాటినుండి 1942 ఆగష్టు మొదటి వారంలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీతోసహా, ఫాసిష్టు వ్యతిరేకతను కాంగ్రెసు ప్రకటించుతూనే వచ్చింది. ఇంతేగాక అబిసీనియాలో ఇటలీ దురాక్రమణను, స్పెయిన్, ఆస్ట్రియా, జెకోస్లోవేకియా పోలండులలో ఫాసిష్టుల దురాక్రమణను కాంగ్రెసు పదేపదే ఖండించింది. చైనాలో జపాన్ దుండగీడుతనాన్ని నిరసించుటేగాక, కాంగ్రెసు చైనాకు సహాయంగా ఒక వైద్య దళాన్నికూడ పంపింది. అట్టి కాంగ్రెసు మహాసభ పేరును ఉపయోగించుకుంటూ, ఫార్వర్డుబ్లాకిష్టులు జపాన్ అనుకూల ప్రచారాన్ని చేయగలుగుతున్నారంటే, జపాన్ ఆక్రమిత రేడియోలను వినమంటూ కాంగ్రెసు పేరున ప్రకటించే కరపత్రిలలో వ్రాయగలుగు తున్నారంటే, మన ఆంధ్ర కాంగ్రెసు రాజకీయాలు ఎంత నికృష్టదశకు వచ్చాయో తేటతెల్ల మవుతుంది.

ఒకపుడు కాంగ్రెసును విచ్ఛిన్నం చేయడానికిప్రయత్నించిన ఫార్వర్డుబ్లాకుకు నేడు ఆంధ్ర కాంగ్రెసును ఉపయోగించుకొనే అవకాశం ఎలావచ్చిందో చూదాం. అఖిలభారత కాంగ్రెసు నాయకులను బొంబాయిలో అరెస్టుచేసిన వెంటనే ఆంధ్రనాయకులలో ముఖ్యులను ప్రభుత్వం జైళ్ళకు పంపించింది. తరువాత చెలరేగిన ఉద్యమంలో ఛోటా కాంగ్రెసు నాయకులు కొందరు అరెస్టు అయ్యారు. స్టేషన్లు తగులబెట్టడం, రైలు కమ్మీలు పీకడం వగైరా అరాచక కార్యాలు స్వాతంత్ర్యానికి మార్గం కాదని తెలిసి కొన్న కాంగ్రెసు వాదులు పికెటింగు వగైరా పనులుచేసి జైళ్ళకు పోతున్నారు. దీనితో కరపత్రిలు అచ్చువేయడం వగైరా పనులు చెయ్యాలసిన కాంగ్రెసు రహస్య నిర్మాణం ఫార్వర్డు బ్లాకిష్టుల చేతుల్లోపడింది. వారికి కాంగ్రెసు పేరుతో డబ్బు ప్రోగుచేయడానికి అవకాశంకూడా లభించుతూంది. అందుచే ఈ అరాజకోద్యమం వల్ల లాభంలేదని ప్రజలు తెలిసికొన్నా, ఫార్వర్డుబ్లాకిష్టులు హతాశులైన కాంగ్రెసు వాదులను కొలదిమందిని చేరదీయగల్గుతున్నారు. వీరిలో కమ్యూనిష్టుపార్టీ నుండి ద్రోహిగా ప్రకటించబడి, తొలగించబడిన అన్నాప్రగడ కామేశ్వర్రావు వంటివారు చేరారు, వీరికి జతగా ఎల్లప్పుడూ రెండుపడవలపై కాలువుంచుటే తమ పాలసీగా కల్గిన కొందరు ఆపద్యునిష్టులు (వీరు యిదివరకు రైతురంగంలో కృషిజేసినవారు) కూడా చేరారని తెలుస్తూంది.

వీరు యీ మధ్యసమావేశములు పోలీసులు కమ్యూనిష్టులను అరెస్టు చేస్తున్నందుకు సంతోషపడ్డారట. అటు కాంగ్రెసు నాయకులను, యిటు కమ్యూనిష్టులను కూడా అరెస్టు చేయడంవల్ల తమబండి అడ్డులేకుండా నడచిపోతుందనీ, ప్రజలపై నాయకత్వం తమకే వస్తుందనీ ఆత్మ సంతృప్తి పడ్డారు. ఆపద్యునిష్టు ముఠావారు రైతుసంఘాలనుండి కమ్యూనిష్టులను తరిమివేస్తామని వాగ్దానం చేశారు.

ఇటువంటి వారి చేతులలో నేడు కాంగ్రెసు నిర్మాణంపడింది. వీరు కాంగ్రెసు పేరును జపాన్ అనుకూల ప్రచారానికి వినియోగించి, జాతీయోద్యమాన్నే పంచమాంగదళమనే పేరుతో అణచివేసే అవకాశాన్ని ప్రభుత్వానికి కలుగజేస్తున్నారు. ఆంధ్ర కాంగ్రెసు వాదు లందరూ కాంగ్రెసు తీర్మానాలకు, ఆదర్శాలకు ప్రత్యక్ష విరుద్ధంగా పనిజేస్తున్న జపాన్ అనుకూల ముఠానుంచి కాంగ్రెసు ప్రతిష్టను కాపాడాలి.

ఇంకోసంగతి. పశ్చిమ గోదావరిజిల్లా తణుకులో రాష్ట్ర ఫార్వర్డు బ్లాకు ఆర్గనైజరు రాత్రివేళ కొలది మంది విద్యార్థులను ప్రోగుజేసి, కమ్యూనిష్టులను దూషించసాగాడు. అచటి విద్యార్థి ఒకడు అతని దూషణలను యెదుర్కొని ఫార్వర్డు బ్లాకు విద్యార్థి వుద్యమంలో చీలికలు తెచ్చిందనీ, జపాన్ ఏజంటుగా పని చేస్తూందనీ విమర్శించాడు. దానితో రహస్య ఆర్గనైజరు మండిపడి, "నాముందే యిలా మాట్లాడుతున్నావా?" అని తిట్టి, గుంటూరునుంచి రౌడీలను తెప్పించి, కమ్యూనిష్టులను ఖూనీ చేయించుతాననీ, విద్యార్థులు చెదరకుండా తాము పెట్టిన సంఘంలో చేరాలనీ హెచ్చరించాడు. ఈ తలతిక్క డబాయింపును యెదిరించుతూ ఒక చురుకైన విద్యార్థి రహస్య ఆర్గనైజరు తెచ్చిన సాహిత్యాన్ని అచటే నిప్పంటించి తగులబెట్టాడు. పాప మా ఆర్గనైజరు తెల్లబోయి, వచ్చిన దారిబట్టాడు. ఈ ఉదాహరణ వీరు ప్రజలను భీతిగొల్పి తమ పని చేయించుకోవాలనే ఫాసిస్టు పద్ధతుల అవలంబించుతున్నారని తెలియజేస్తుంది.

ఇంతేగాక యీ ముఠాకు కమ్యూనిష్టులపై దుష్ప్రచారం గావించడమే పనిగా కన్పించుతూంది. గుంటూరు విద్యార్థి సంఘ కార్యదర్శి కామ్రేడ్ రంగాచారిని పోలీసులు అరెస్టుజేస్తే కమ్యూనిష్టులే పట్టించారని యీ ద్రోహులు ప్రచారం జేశారు; సిగ్గులేకుండా తమ కరపత్రింలో అచ్చు వేశారు. కాని నిజం దాగదు గదా: విడుదల అయిన వెంటనే కామ్రేడ్ రంగాచారి తన అరెస్టుకు కారణం కమ్యూనిష్టులు కాదనీ, "రాజకీయ విభేదాలతో యింత నీచ ప్రచారానికి ఒడిగట్టటం కంటె దుర్మార్గం లేదనీ" ప్రకటించాడు.

ఫార్వర్డు బ్లాకిష్టులు వేసే కరపత్రాలలో సామ్రాజ్యవాదులను యెదుర్కొనే విధానంగాని, స్వాతంత్ర్యానికి పంథానుగాని వివరించడం కంటె కమ్యూనిష్టులను ఆకుకు, పోకకు అందకుండా దూషించడమే కనబడుతూంది. మచ్చుకు కొన్ని ఉదాహరణలు : కమ్యూనిష్టులను జైళ్ళకు పంచమాంగదళం పని చేయించుకోడానికని ప్రభుత్వం జైళ్ళకు పంపుతోందట. గుమ్మడి కాయల దొంగ లెవరంటే బుజాలు తడుముకున్నట్లు వీరి ప్రచారం. తాము జేసేపని జపాను యేజెంట్లు జేసే పని అయిన వీరు కమ్యూనిష్టులను అలా అనడంలో ఆశ్చర్యం లేదు. నైచ్యాన్ని మాత్రమే తెలియజేస్తుంది. ఏమంటే కామిర్లరోగికి ప్రపంచమంతా పచ్చగా కన్పించడం సహజమే గదా! ఒక కరపత్రములో వీరు "కమ్యూనిష్టులను హతమార్చండి. ప్రజాశక్తి - పీపుల్సువార్ పత్రికలను బహిష్కరించండి" అనే నినాదం యిచ్చారు. అలాంటి కరపత్రాన్ని వీరిచే మోసపుచ్చబడిన అనుచరులు సహితం పంచమని నిరాకరించారని గుడివాడ నుండి తెలియ వచ్చింది. కమ్యూనిష్టులు జపాన్ దుండగీడులను, తమ ప్రాణాలను ఒడ్డి అయినా యెదిరించి తమ మాతృదేశాన్ని రక్షించుకోడానికి సిద్ధంగా వున్నారు. ఫాసిస్టుల విజయాలను చూచి, వారు జయించుతారనే ఆశతో - కొత్త విటుణ్ణి చేరబోయే బోగందానివలే - ప్రవర్తిస్తున్న దేశద్రోహుల పంథాను అవలంబించిన ఫార్వర్డు బ్లాకువారి బెదరింపులకు కమ్యూనిష్టులు యెన్నడూ జంకరు. తమ ప్రజలకు, తమ దేశ స్వాతంత్ర్యానికి సరియైన మార్గాన్ని అనుసరించడంలో యెన్ని కష్టాలనైనను సహించి, సాఫల్యం పొందే అకుంఠిత దీక్ష వారికి వుంది; తమ పాలసీ ఒక్కటే స్వాతంత్ర్యానికి మార్గమనీ, ప్రజలకు నచ్చచెప్పి తద్వారా భారత స్వాతంత్ర్యాన్ని సాధించగలమనే ఆత్మ విశ్వాసం వారికుంది.

కమ్యూనిష్టులకు ప్రభుత్వం డబ్బు యిస్తూందని చెప్పడం, ఫార్వర్డుబ్లాకిష్టుల దుష్ప్రచారంలో ఒక భాగం కమ్యూనిష్టులతో సంబంధమున్న ప్రజలందరకూ దీనిబూటకత్వం తెలుసు. కామ్రేడ్ సుందరయ్య, వాసుదేవరావు వగైరా అనేకమంది తమ ఆస్తిని అమ్మి పార్టీ పనికి వినియోగించారు; ప్రజలనుండి వసూలు చేయడం, వసూలు చేయడంద్వారాకూడా పార్టీఖర్చులు భరించబడుతున్నాయి. రహస్య దినాలలో అనేకమంది కామ్రేడ్సును ప్రమాదాలకు జంకక ఆంధ్ర ప్రజలు తమ బిడ్డలుగా పోషించారు. నేడు కూడా ఆ ప్రజల త్యాగమే మా పార్టీ పనిచేయడానికి కావలసిన డబ్బును సప్లయి చేస్తూంది. వారి ఆదరాభిమానాలే ఐదునెలలలో 'ప్రజాశక్తి' పత్రిక ప్రతివారం ఐదువేల ఐదువందలు అచ్చువేయడానికి తగిన ధనాన్ని, అవసరాన్ని కలిగించాయి. కాంగ్రెసు మంత్రుల రోజులలో ప్రజల కష్టనివారణకు కృషిచేస్తూ ప్రభుత్వ నిరంకుశత్వంతో పోరాడినప్పుడు మితవాదులు మాకు "మాస్కో బంగారం వస్తూందని" ప్రచారం చేశారు. నేడు అరాజక చర్యలను ప్రోత్సహించడంద్వారా జపాన్ దుండగీడుల దారిని శుభ్రపరుస్తున్నవారు, మాకు బ్రిటీషుసామ్రాజ్యవాదులు డబ్బు యిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. అప్పుడు ప్రజలు నమ్మలేదు; ఇప్పుడూ నమ్మరు. ప్రజలకు సేవ చేయడానికి, స్వాతంత్ర్యం కొరకు పోరాడటానికి కమ్యూనిష్టులం అగ్రగాములంగా ఉన్నంతకాలం ఈ ప్రచారం చేసేవారి నోటి కంపే బయటపడుతుందిగాని, ఈ అబద్ధాలు మమ్మేమీ చేయలేవు.

ఫార్వర్డుబ్లాకు ముఠావారు తామనుకొన్నట్లు ప్రజలు అరాచకచర్యలు కొనసాగించునట్లు చేయలేకపోయారు. అందుచే హతాశులైన కొందరు దేశభక్తులను వినియోగించుకొని రహస్య టెర్రరిస్టు చర్యలు జరుపాలని ప్రయత్నించుతున్నారు. జగ్గయ్యపేటలో బాంబు, ఆంధ్ర విశ్వవిద్యాలయ లైబ్రరీ తగుల బెట్టడానికి ప్రయత్నం, పునాదిపాడు హైస్కూలు తగులబెట్టడం, వగైరా యిందుకు ఉదాహరణలు. వీటిని నిజమైన కాంగ్రెసువాది ఎవరూ సమర్థించ జాలడు. అదేవిధంగా కాంగ్రెసు మహాసభ ఆదర్శాలకు వ్యతిరేకమైన జపాన్ అనుకూల ప్రచారాన్ని కూడా నిజమైన కాంగ్రెసువాది అంగీకరించలేడు. కాన ఆంధ్ర కాంగ్రెసువాదులందరికి మా మనవి ఏమంటే: ఫార్వర్డుబ్లాకు, జపాను ఏజెంట్లనుండి కాంగ్రెసు సంస్థను, దాని గౌరవాన్ని కాపాడండి.

హిట్లర్, స్టాలిన్‌గ్రాడ్ ఆశ వదలుకొన్నాడు

కామ్రేడ్
తుమ్మల వెంకటరామయ్య

స్టాలిన్‌గ్రాడ్ రెడ్ అక్టోబరు ఫ్యాక్టరీ ప్రదేశంపై హిట్లరు అక్టోబరు 15 వ తేదీన తీవ్రమైన దాడి సాగించాడు. అనాటినుండి నేటివఱకు నాలుగు సూటిదెబ్బలు కొట్టాడు. కాని విఫలుడయ్యాడు. రెడ్ అక్టోబరు ఫ్యాక్టరీ ఏరియాలో అనేక భవనాలను రష్యన్లు తిరిగి వశంచేసికొంటున్నారు.

నవంబరు 4 వ తేదీరాత్రి, సోవియటు సైన్యాలు స్టాలిన్‌గ్రాడుకు ఉత్తరంగా వైన, వాల్గానది ఒడ్డున అతి సాహసంతో దిగారు. ఇవి ఫ్యాక్టరీ ఏరియాలోని జర్మను ఉధృతాన్ని తగ్గించ సహాయపడ్డాయి. స్టాలిన్‌గ్రాడుకు ఉత్తరంగాను, దక్షిణంగాను, సహాయక సైన్యాలు రోజురోజుకూ సమీపించుతున్నాయి. స్టాలినుగ్రాడుపై దాడిచేసే జర్మను సైన్యాల ఎడమ పార్శ్వాన్ని ఖంగారుపెడుతున్న టిమోషెంకో సైన్యాలు స్టాలిన్‌గ్రాడును సమీపించుతున్నాయి. ఇంతేగాదు. డాన్ మలుపులో అనేకచోట్ల టిమోషెంకో సైన్యాలు నదిని దాటాయి. రెడ్ అక్టోబరు ఫ్యాక్టరీ ప్రదేశానికి దక్షిణంగా 40 మైళ్లలో నున్న "కుపొరోస్నోయి" అనేస్థలానికి, దక్షిణ సహాయక సైన్యాలు చేరాయి.

ఒక ప్రక్క చలికాలం ముంచుకు వస్తోంది. అప్పుడే మాస్కో ప్రాంత సైనికులు చలికాలపు దుస్తులు వేసుకుంటున్నారు. కొలదికాలంలోనే హిట్లరు సైన్యాలు, వెనక్కి పోవడమో, సోవియట్ అడకత్తెరలో చిక్కొనడమో చూడగలం.

ఇక కాకాసస్ పర్వత ప్రాంతాల చూద్దాం. విశ్వప్రయత్నం జేసి, కాకాసస్ పర్వతాలను దాటిపోవాలని జర్మన్లు వాంఛిస్తున్నారు. మోజడాక్ ప్రదేశంలో హఠాత్తుగా నాజీలు. గ్రోజ్నీకి తిన్నగా పోవ ప్రయత్నించడం మానివేశారు. నాలచిక్ పై దాడి సల్పారు. నాల్చిక్, మోజడాక్‌కు నైరుతిగా 70 మైళ్లలో వుంది. జార్జియా ముఖ్య పట్టణమైన టిఫ్లిస్ పోయేరోడ్డులో ఇదిఒకపట్టణం. కాని టిఫ్లిస్‌కు పోవాలంటే పర్వత మార్గాన్ని దాటాలి. మోజడాక్‌నుండి తిన్నగా గ్రోజ్నీకిపోలేని నాజీ సైన్యాలు, పార్శ్వపు దాడులద్వారా తమ ధ్యేయాన్ని పూర్తి చేయాలని తలుస్తున్నాయి. "అలాగిర్" "ఆర్‌జోనికిడ్జి"ల వైపుకు దాడి ఇదే తెలియజేస్తోంది. ఈ ప్రాంతంలో నైతం గత మూడు దినాలుగా జర్మనులు ముందుకు సాగడంలేదు. గత 11 దినాలనుండి (8 వ తేదీకి) ఈ ప్రాంతాల జరిగిన భీకరయుద్ధంలో మూడు లేక నాలుగువేల సైనికులను, 300 టాంకులను శత్రువులు నష్టపడ్డారు, గ్రాజ్నీ నూనెగనులను అగస్టు 24 వ తేదీకి తీసుకోవాలని జర్మను మిలటరీ నాయకులు ఆశపడినట్లు ప్రవడా పత్రిక బయటపెడుతోంది.

"నొవొరొసిస్క్", "ట్యాప్సీ" ప్రాంతాలు గూడ, సోవియటు సైన్యాలు, శతృవులనుండి చొరవను లాగేశాయి. సోవియటు సైన్యాలే అడకత్తెర వ్యూహంతో శతృవులను తరుముతున్నాయి.

కాకేషియా ప్రజలను బానిసలను గావించి మధ్య ప్రాచ్యానికి యిండియాకు రా జూచుచున్న ఫాసిస్టు దోపిడిగాండ్రకు, కామ్రేడ్ కాలినిన్ చెప్పినట్లు కాకాషియాను రుద్రభూమిగా సోవియటు వీరులు మార్చుతున్నారు.

రెండవ రంగం

స్టాలిన్‌గ్రాడ్, కాకాసస్‌లోను నిశ్చిత విజయాలను సాధించాలంటే హిట్లరు సైన్యాలను సర్వ నాశనంచేసే దెబ్బలు ప్రారంభించాలంటే రెండవ రంగం అవసరం. కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసాన్ని మరోచోట యిస్తున్నాం: ఉపన్యాసంలో నొక్కి చెప్పిన విషయం యిదే: "రెండవ రంగమే గనుక వున్నట్లయితే, కనీసము 80 డివిజన్ల అక్షరాజ్య సైన్యాలు స్టాలిన్‌గ్రాడ్ రంగంలో తగ్గియుండేవి. అప్పుడే హిట్లరు ముఠా పతనం ప్రారంభమయివుండేది. వేసవిలో జర్మనీ దాడి గావించి దక్షిణ రంగములో చొచ్చుకు రాగల్గిందంటే రెండవరంగం లేకపోవడమే కారణం ఈ సంవత్సరం సెప్టెంబరులో జర్మనీకి, దాని మిత్రులకు వున్న 256 డివిజన్లలోను, 240 డివిజన్లు సోవియటు యూనియన్‌పైననే పడినాయి. తమకు రెట్టింపు సైనికులతో సోవియటు సైన్యాలు పోరాడవలసి వస్తోంది. మనదేశపు సైన్యమూ అక్షరాజ్యాల ధాటికే తట్టుకొని యుండగల్గేదికాదు. రెండవ రంగం మా ఒక్కరి అవసరమేగాదు; మిత్రరాజ్యాలకు కూడా అవసరమే. అందుచేతనే రెండవ రంగం తెరవాలి."

కామ్రేడ్ స్టాలిన్ హెచ్చరిక, ఈజిప్టు యుద్ధమే రెండవ రంగమనేవారికి కన్ను తెరిపించుతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో అమెరికనులు దిగుటమే: "ప్రస్తుత సమయంలో రెండవ రంగం యొక్క చక్కని రూపం" అంటూ క్రిప్సు అన్నాడు. ఇలాంటి సామ్రాజ్యవాద దాసులకు స్టాలిన్ హెచ్చరిక మంచిదోస్.

కామ్రేడ్ స్టాలిన్ తన ఉపన్యాసములో ఈజిప్టు పోరాట ఫలితంగా నాలుగు జర్మనుడివిజన్లు, 11 ఇటలీ డివిజన్లు మాత్రమే మరల్చబడుతున్నాయని చెప్పాడు. "పీపుల్సు వార్" లండన్ విలేఖరి ఈ క్రింది విషయాన్ని తెలియచేశాడు. "ఈమధ్య యీజిప్టులో ప్రారంభించిన దాడినే రెండవ రంగమని డప్పాకొట్టే ప్రయత్నం వుంది. కాని యిది యెవరినీ మోసగించజాలదు. ఈ యుద్ధం అక్ష రాజ్యాల సైన్యాలను యెక్కువగా మరోచోటికి మరల్చలేదని అందరికీ తెలుసు. ఈజిప్టు రంగంలో మొత్తం వున్న జర్మన్ల, యిటాలియన్లకంటె ఒక్క రెజెవ్‌రంగంలోనే ఎక్కువమందిఉన్నారు."

స్టాలిన్‌గ్రాడ్‌లో సోవియటు సైన్యాలకు సహాయం చేయడానికి ఈజిప్టు యుద్ధం అంతగా చాలదని నొక్కి చెప్పడానికే పైది చెప్పబడినది. దీని అర్థం, ఈజిప్టు యుద్ధంగాని, ఆఫ్రికా విజయాలుగాని ప్రాముఖ్య విహీనమైనవనికాదు.

ఆఫ్రికా యుద్ధం

గతనెల 23 వ తేదీన బ్రిటిషుదాడి, రోమెల్ సైన్యాలపై ప్రారంభమయింది. కొద్దిదినాలు మాత్రమే అయినా, ఇప్పటికే ప్రాముఖ్య విజయాలు లభించాయి. రోమెల్ సైన్యాలు చిందరవందరగా పారిపోతున్నాయి. ఎల్‌అలామీన్, ఎల్‌డాబా, ఫ్యూకాలనుదాటి, మార్సామాట్రూను బ్రిటిషు సైన్యాలు వశంచేసికొన్నాయి, రోమెల్ సైన్యాలిక లిబియా సరిహద్దులకు పోవలసి వచ్చింది.

ఒకవేళ లిబియాలోకూడ బ్రిటను జయించినా అది ఒక్కటే చాలదు. ఫ్రెంచి ఆఫ్రికాలోని ట్యూనిస్ మంచి కేంద్రం. అచటికి ఇటలీ జర్మనీలు సైన్యాలను పంపి రక్షణకు దిగవచ్చు. అట్టి పరిస్థితులలో హిట్లరుకు జోహుకుం అయిన లావల్ అభ్యంతరపెట్టడు గదా. మెడిటిరేనియన్‌లో నిరభ్యంతరంగా దారి కావాలంటే, ఉత్తరఆఫ్రికా యావత్తూ మిత్రమండలి చేతులలో వుండడం అవసరం. అందుచేత అనామకంగా వున్న ఫ్రెంచి "తాటస్థ్యత"ను ఉల్లంఘించి అమెరికన్ సైన్యాలు ఫ్రెంచి ఉత్తర ఆఫ్రికాలో దిగాయి, ఓరాన్ ఆల్జీర్స్‌లను ఆక్రమించుకొన్నాయి. అటు అట్లాంటిక్‌సముద్రంవైపు తీరాన్ని కాసబ్లాంకా వద్ద అమెరికను సైన్యాలు దిగాయి. రేబాత్ ఖాళీచేయబడింది. కాసబ్లాంకావద్ద నౌకాయుద్ధం జరుగుతోంది.

అక్షరాజ్యాల సేనల వెనుకభాగంలో బల్లెపుపోటుగాను, మెడిటెరేనియనులోని సబ్‌మెరిన్లను వేటాడటానికీ, మధ్య ప్రాచ్యానికి రాకపోకలు దగ్గర పడటానికీ, ఈ అక్రమణ ఉపయోగపడుతుంది. అయితే ఇంకా తీవ్ర నౌకాయుద్ధాలతదనంతరంగాని,దీనిఫలితం చెప్పలేం.

ఈ రెండు దాడులుగను అక్షరాజ్యాలను చుట్టుముట్టడించే పెద్ద వ్యూహ మయినప్పుడే (అందుకు మిత్రమండలి ప్రధానరంగం పశ్చిమ యూరప్‌పయి వుండాలి.) అక్షరాజ్యాలపతనం సంభవించుతుంది.

నేడు బ్రిటిషు అమెరికను సైన్యాలు ఆఫ్రికాలో ఇట్టి విజయాలను పొందగలుగుతున్నారంటే, అది స్టాలిన్‌గ్రాడ్ ప్రతిఘటనా శక్తి వల్లనే. స్టాలిన్‌గ్రాడ్ హిట్లరు ప్లాను లన్నిటినీ తల్లక్రిందులు చేసింది. అప్పుడే హిట్లరు క్షమాపణలకు దిగాడు. హిట్లర్ ఉపన్యాసంలో అమంగళధ్వని, హిట్లరు కంఠధ్వనిలో అపజయ భీతి కనపడుతోంది.

కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసం

కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసంలో ముఖ్యంగా గమనించవలసిన విషయాలివి.

(1) రెండవరంగం లేకపోవడమే జర్మను యిటీవల విజయాలకు, జర్మనీ యిదివరకే ఓడింపబడక పోవడానికి కారణము. మిత్రరాజ్యాల క్షేమానికి కూడా అది అవసరం.

(2) వేసవి దాడిలో జర్మనీ ఆశయం యురల్సునుండి మాస్కోను తెగగొట్టడం, ఆ తరువాత మాస్కోనే వశం చేసుకోడం, కాని యిది నెరవేరలేదు.

(3) అలాగే జర్మను టైంటేబుల్ తల్లక్రిందు లయింది. జులై 10 నాటికి "బోరిసో - గ్లెబ్స్క్"లోను, జులై 25 కు స్టాలిన్ గ్రాడ్"లోను, ఆగష్టు 10 కి "సారటావ్"లోను, ఆగష్టు 15 కి "స్యజ్రాన్"లోను, సెప్టెంబరు 25 కు బాకూలోను వుండదలచాయి జర్మను సైన్యాలు. ఈప్లాను పూర్తిగాతల్లక్రిందులైంది.

(4) స్టాలిన్ ఉపన్యాసంలో అపజయ భీతి యెక్కడా లేదు. అలా అని ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయడంలేదు. "ఇలాంటి దాడులను యింకా జర్మనీ సాగింపవచ్చు." అని హెచ్చరించాడు.

(5) మనుష్య బలంలోను, సాధన సంపత్తిలోను మిత్రమండలికే అధిక బలం వుంది. దానిని సరిగా వినియోగించుకోవాలని మిత్రరాజ్యాలను హెచ్చరించాడు.

హిట్లర్ ఉపన్యాసం

స్టాలిన్ గ్రాడ్‌ను పట్టుకోలేని హిట్లరు యేవో సాకులు చెబుతున్నాడు. సెప్టెంబరు 30 వ తేదీన మాట్లాడుతూ హిట్లరు "రష్యాలో గొప్ప రాకపోకలకు జీవనాళమైన వాల్గాను, స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకోడానికి దాడి సాగించాం. ఒక్కసారి మనం అక్కడికి చేరామా, మనలిని యెవరూ బయటికి గెంటలేరు."అన్నాడు.

కాని ఆకోర్కె గొంతెమ్మకోర్కె అయింది. ఇపుడేమంటున్నాడు చూడండి.

"....మన ఆశయాలు ఒక ప్రత్యేకపట్టణం వైపుకు మరలాయి. (బల్లగుద్ది మరీ చెబుతాడు) అది స్టాలిన్‌పేరు పట్టణంగనుక కోరానని అనుకోకండి. అది కూడలిగా చాల ప్రముఖ్యమైనది. అయితే శత్రువుల బలమైన పాయింట్లను ఎందుకువశంచేసికో లేదంటారా? నేను రెండవ"వెర్డన్"ను కోరను" (వెర్డెన్‌వద్ద గత ప్రపంచయుద్ధంలో కైజర్ ఓడిపోయాడు.)

హిట్లరుపన్యాసం అంతా అపశృతి, అమంగళ వాక్యాలతోనే వుంది. మాట్లాడితే కైజరుతో పోల్చుకొని, తాను కైజరును కాననీ, తాను లొంగిపోననీ చెప్పుకొన్నాడు. "యుద్ధం యెందుకు ప్రారంభించావురా బాబూ" అనే జర్మన్లలో లోపలి భీతికి జవాబుగా హిట్లరు "పోలండు మనం చెప్పినట్లు వింటే, మరో ప్రమాదం వచ్చి వుండేది. తూర్పు నుండి సైన్యాలు (బోల్షివిక్) మన దేశంలోనే యుద్ధం చేసివుండేవి. ఇప్పుడు యుద్ధం యితర దేశాలలో జరుగుతుంది. మీకెంత హాయి!" అని బుజ్జగించ జూస్తున్నాడు. అయితే బ్రిటిషు విమానదాడులు గల్గించే బీభత్సానికి, రష్యాలో జరిగే ప్రాణ నష్టానికి జవాబేమిటి? "ఇంగ్లండుపై బాంబుల కురిపిస్తాం" అని ఓదార్చుతున్నాడు. రష్యాపై యుద్ధంలో దిగిన తర్వాత 1940 అక్టోబరులో యింగ్లండుపై గావించిన భీషణ విమాన దాడులను గావించలేకపోయాడని ప్రపంచాని కంతకూ తెలుసు. ఇక ప్రాణ నష్టాన్ని గురించి, 3 లక్షల 50 వేలు మాత్రమేనని బుకాయింప జూస్తున్నాడు. భర్తలను, కొడుకులను కోల్పోయిన ప్రతి జర్మను కుటుంబమూ, యీ పచ్చి అబద్ధాన్ని యెలా నమ్మగలదు? ఆఫ్రికా అపజయాలకు కూడా "అంతిమ విజయం నాదేలే" అన్న ధోరణికి దిగాడు. "ఏదైనా ఒక సోషలిస్టు దేశముంటే అది జర్మనీయే" నని నవ్వు తెప్పిస్తున్నాడు.

హిట్లరు ప్రతి వాక్యంలోను అపజయ భీతి ద్యోతక మౌతోంది: రంకెలు, డప్పాలు యెన్నాళ్ల కొనసాగుతాయి.

ఆక్రమిత యూరప్‌లో హిట్లరు గాంగును హతమార్చ ప్రజలు ఉవ్విళ్లూరు తున్నారు. ఫ్రెంచికార్మికులను బలవంతంగాజర్మనుఫ్యాక్టరీలలోనియమించాలనే కోర్కె విఫలమయింది. సమ్మెలు వ్యాపింప సిద్ధమయే సరికి, ఎన్ని వాయిదాలు గడస్తున్నా, జర్మనీ మెదలకుండా కూర్చున్నది. ఇట్టిపరిస్థితులలో రెండవ రంగం ఎంత సహాయకారో చెప్పనక్కరలేదు.

"మనం ప్రతివారం జయాలను పొందలేం. ఇదిసాధ్యంగాదు, అవసరం కూడా కాదు. మనం గెల్చుకొన్నది నిలబెట్టు కోడమే ముఖ్య అవసరం" అని అంటున్న హిట్లరు ఆత్మరక్షణ వ్యూహాన్ని బ్రద్దలు చేయాలి.

స్టాలిన్ గ్రాడ్ యుద్ధాన్ని జపాను కూడా ఆశతో ఎదురు చూచింది. మధ్యప్రాచ్యంలోకి హిట్లరురాగల్గిన పక్షంలో, అమెరికనునౌకలు, సప్లయిలు తగినంత పసిఫిక్ రంగానికి రాడానికి వీలుండదూ. అప్పుడు, న్యూగినిలో, సోలమన్ దీవులలోజపాను స్థిరపరచుకోగలిగి సైబేరియాపైనో, ఇండియా పైననో పడగల్గియుండేది. గతజూన్‌లో సోలమన్సును జపాను ఆక్రమించుకొనడం, అలూషియన్ దీవులను కాజేయడం, మిడ్వే దీవులను అపహరింప జూడడం దానినే తెలియ జేస్తున్నాయి. సోవియటు అమెరికన్ రాకపోకలను తెగగొట్టడానికి, జపానుపై, అమెరికా బాంబులపై కాయడానికిగాను పనికివచ్చే స్థానాలను ఆక్రమించుకోడానికిగాను అలూషియను దీవుల ఆక్రమణ జరిగింది. కాని అమెరికా యిందులో కొన్ని దీవులను తిరిగి స్వాధీనం చేసికొంది,

న్యూగినియాలోని మోరెస్‌బే రేవును పనికి రాకుండా జేయటానికి, ఆస్ట్రేలియాకు అమెరికను సప్లయిలను ధ్వంసం చేసేందుకు వీలైన వేదికగా ఉపయోగించుకోడానికి, సోలొమన్ దీవుల ఆక్రమణ జరిగింది. కాని అగస్టులో సోలొమన్సు పునరాక్రమణను అమెరికా సాగించింది. ఇది జపానుకు తీరని దెబ్బ అవుటచే యుద్ధానికి పూనుకుంది కల్నల్‌నాక్సు చెప్పినట్లు సోలొమన్సు యుద్ధంలో మొదటి రౌండ్ ముగిసింది. జపాను నౌకలకు తీవ్రమైన నష్టం కలిగింది. న్యూగినియాలో కొకోడాను అక్రమించుకోడం కూడ జపానుకు తీరని దెబ్బనే. సోలొమన్సును పునరాక్రమించుకొన జూచుటలో జపాను ఉద్దేశ్యం, తాను కొత్తగా సంపాదించిన పసిఫిక్ సామ్రాజ్యంలో వెనుభాగం సురక్షితంగా వుంచుకొనుటకే. అలా సురక్షితమైననాడు యిండియాపై దాడి సులభం. అమెరికన్ల నూతన విజయాలు జపాను టైంటేబిలును కూడ తల్లక్రిందులు చేశాయి.

అస్సాంపై నిరంతర దాడి చూస్తే, అది వుత్త ప్రతీకారపు దాడులే అనుకో వీలులేదు. ఒకప్రక్క సోలొమన్సులో తీవ్ర యుద్ధం జరుపుతూనే యీ దాడులు గావించడం జూస్తే జపాను త్వరలోనే తన వెనుభాగాన్ని సురక్షితమొనర్చుకో గలనని ప్రారంభించినట్లు తోస్తుంది. కల్నల్‌నాక్సు హెచ్చరిక జూచినా యితర పరిస్థితులు జూచినా సోలొమన్సులో అమెరికనుల పరిస్థితి విషమమైనదే. అందుచే యిండియాపై దాడి తప్పిపోయిందని సంతోషించ వీలులేదు. —10—11—42.

శత్రువు అంత్యదశ సమీపించుతోంది

కామ్రేడ్ స్టాలిన్ ఉపన్యాసం

"ఇటలీ - జర్మనీల పక్షం యీ క్రింది దురుద్దేశాలతో పనిచేస్తూంది': మానవ జాతులలోద్వేషాన్ని పురిగొల్పడం (Racial - hatred) ; కొన్ని జాతులు యితర జాతుల కంటె ఉన్నతమైనవనీ, కాబట్టి ఆ జాతులపై పెత్తనం చెలాయించడాన్ని సమర్థించడం; ఇతర దేశాల సరిహద్దులపైబడి ఆ ప్రజల్ని నిర్బంధించి లొంగతీయడం; జయించబడిన దేశాలను ఆర్థికంగా బానిసత్వంలో ముంచడం; వాటి జాతీయ సంపదను కొల్లగొట్టడం; ప్రజాస్వామ్య హక్కుల్ని ధ్వంసం చేయడం; ప్రతి చోట హిట్లరుకు అనుకూలమైన ప్రభుత్వాలు నిర్మించడం.

సోవియట్ - బ్రిటన్ - అమెరికాల పక్షం

"సోవియట్ - బ్రిటన్ - అమెరికాల పక్షం యీ క్రింది కార్యక్రమానికై పని చేస్తూంది. వేర్వేరు మానవ జాతుల మధ్య వివక్షణ (Racial Exclusiveness) ను నిర్మూలించడం ; వేర్వేరు జాతుల మధ్య సమానహోదా; వాటి సరిహద్దుల రక్షణ; బానిస జాతుల విమోచన; వారికి స్వతంత్ర్య రాజ్యాంగ నిర్మాణపు హక్కు; వారు తమ కిష్టమైన పరిపాలనా విధానాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు; యుద్ధంలో అనేక బాధలుపడిన దేశాలకు ఆర్థికంగా సహాయం చేయడం; ఆయా దేశాలు తమ సంపద నభివృద్ధి చేసుకోవడంలోను, ప్రజాస్వామ్య హక్కుల్ని తిరిగి స్థాపించుకోవడంలోను, హిట్లర్ పరిపాలనను సర్వనాశనం గావించడం లోను చేదోడు వాదోడుగా ఉండి పనిచేయడం.

ఆక్రమిత దేశాలలో

"యూరప్‌లోను, సోవియట్ రష్యాలోను, శత్రువులచే ఆక్రమించుకొనబడిన దేశాలలో ప్రజలు ఇటలీ-జర్మనీల పరిపాలకుల్ని విపరీతంగా అసహ్యించుకొంటున్నారు. వారి ద్వేషాగ్ని మిన్నుముట్టుతోంది. జర్మన్లకు, వారి అనుచరులకు, ఎంతనష్టం కలిగించగలరో అంతనష్టం కలిగిస్తున్నారు. తమ స్వాతంత్ర్యాన్ని మట్టిపాలుచేసి, తమ్ము బానిసత్వంలో ముంచివేసినందుకు వారు ప్రతీకారం కొరకెదురుచూస్తున్నారు. ఇన్నాళ్ళనుంచి తామనుభవిస్తున్న అవమానాలకు, దౌర్జన్యాలకు, కసి తీర్చుకోవాలని వారు చూస్తున్నారు. ఇటలీ-జర్మనీల పక్షమవలంబిస్తూన్న కార్యక్రమమే దీనికి కారణం.

ఇటలీ-జర్మనీల పక్షపు బలహీనత

ప్రస్తుత సమయంలో మనయెదుట కనబడే ప్రధానదృశ్య మేమంటే, ఇటలీ-జర్మనీలపక్షం ప్రపంచప్రజలందరికి దూరమై, యూరప్‌లో రాజకీయంగాను, నైతికంగాను, సంపాదించిన బలం నానాటికి క్షీణిస్తోంది. ఈ పక్షం రోజురోజుకు బలహీన మవుతోంది. రెండో వైపున సోవియట్ - బ్రిటన్-అమెరికాల పక్షం రాజకీయంగాను, నైతికంగాను, నానాటికి బలపడుతోంది. ఈ పక్షానికి ప్రతిరోజు లక్షలాది ప్రజలు సానుభూతిని ప్రదర్శిస్తున్నారు. దీనితో చేయిచేయి కలిపి, హిట్లర్ యొక్క దుష్పరిపాలనను అంత మొందించడానికి తమ సంసిద్ధతను ప్రకటించుతున్నారు. నైతికంగాను, భౌతికంగాను, ఆలోచించి నట్లయితే, సోవియట్-బ్రిటన్-అమెరికాల పక్షానికే నిశ్చయంగా యెక్కువబల మున్నదను యథార్థాన్ని మనంస్పష్టంగా చూడవచ్చు.

సంయుక్త కార్యాచరణ అవసరం

"ఈ బలాన్ని సరిగా వినియోగించడంలో సోవియట్ - బ్రిటన్ - అమెరికాల పక్షానికి చెందినవారు విశేషమైన శక్తిని, చాకచక్యాన్ని కలిగియున్నారు. ఇందులో సందేహంలేదు. రోజురోజుకు సమీపించుతూన్న ప్రమాదాన్నుండి రక్షించుకోవడానికి వారు సంయుక్త కార్యాచరణకు తప్పక పూనుకోవలసియుంది. హిట్లర్ యొక్క, వాని అనుచరుల యొక్క, కోటను పడగొట్టి దానికి జరిగే నేటి సంయుక్త పోరాటం నిర్మాణ యుక్తంగా అభివృద్ధిపొందడానికి మన పక్షంచే అంగీకరించబడిన కార్యక్రమం తప్పక సరిపోతుందని నానమ్మకం.

రష్యా - బ్రిటన్‌ల మధ్య సంబంధం

"సోవియట్ - బ్రిటన్ - అమెరికాల పక్షముతో చేరి పనిచేస్తూన్న దేశాల ఆదర్శాలు, ప్రభుత్వ నిర్మాణం ఒకటేనని భావించడం హాస్యాస్పదమైన సంగతి. ఈ పక్షానికి చెందిన దేశాలు క్రమంగా విడిపోతాయని మన శత్రువు ఆశించాడు. కాని వాటి మధ్య ఐకమత్యం నానాటికి వృద్ధి అవుతోంది. ఈ ఐక్య సంఘటన బలీయమైన పోరాటపక్షంగా తయారవుతోంది. గత సంవత్సరంలో జరిగిన ఘటనలే యిందుకు తార్కాణం. జులై 1941 లో బ్రిటన్ మనతో కలిసి యుద్ధం చేయడానికి మనకూ, బ్రిటన్‌కూ మధ్య ఒడంబడిక జరిగింది. ఇది జరిగిన 10 నెలల తర్వాత మొలొటోవ్ (విదేశాంగ మంత్రి) ఇంగ్లండుకు వెళ్ళినప్పుడు, యుద్ధనిర్వహణ నిమిత్తం, పరస్పర సహాయం కొరకు, బ్రిటన్ సంధి పత్రంపై సంతకము చేసింది. ఈ సంధి 20 సంవత్సరాల వరకు అమలులో వుంటుంది. మనకు, బ్రిటనుకు మధ్యగల సంబంధ బాంధవ్యాలలో యీ సంధి చారిత్రాత్మకంగా ఒక అపూర్వమైన ఘటన. జులైలో మొలొటోవ్ అమెరికాకు వెళ్ళినపుడు యుద్ధ నిర్వహణలో అమెరికా - రష్యాలు పరస్పర సహాయం చేసుకొనే విషయమై యేకీభావానికొచ్చాయి. చర్చిల్ (బ్రిటిషు ప్రధాని) మాస్కోకు వచ్చినప్పుడు బ్రిటన్ - రష్యాల మధ్యకూడా సంపూర్ణమైన యేకీభావమేర్పడింది.

రష్యాయొక్క యుద్ధాశయాలు

"ఒక టర్కిష్ సైన్యాధికారితో హిట్లరు సంప్రతిస్తూ, ఈవిధంగా అన్నాడు : 'మేము రష్యాను నాశనం చేయడానికి నిశ్చయించుకున్నాం. ఆ దేశం తిరిగి తల యెత్తకూడదు.' ఇట్టి ఉద్దేశ్యం కలగడం ఒక తమాషా అని చెప్పవచ్చు. జర్మనీ దేశాన్ని నాశనం చేయడం మన ఉద్దేశ్యంకాదు. ఈ సమస్య మనలనే విధంగాను బాధించదు. రష్యాను నాశనం చేయడ మెంత అసాధ్యమో, జర్మనీని నాశనం చేయడంకూడా అంతే అసాధ్యం. కాని జర్మనీని పరిపాలించే హిట్లరు కూటాన్ని నాశనం చేయడం మనకు సాధ్యమైన పని. అది మన కర్తవ్యం కూడా. (చాలా సేపు కరతాళ ధ్వనులు). కాబట్టి హిట్లర్‌చే పరిపాలించబడు రాజ్యాంగ యంత్రాన్ని, దాన్ని బలపరుస్తూన్న కూటాన్ని, ధ్వంసం చేయడం మన మొదటి యుద్ధాశయం.

" జర్మనీలోవున్న సేనల నన్నింటినీ నాశనం చేయడం మన ఉద్దేశ్యం కాదు. ఎందువల్లనంటే, ఇది సాధ్యముకానిపని. కాని, హిట్లర్ పార్టీకి చెందిన సేనలను, వాటి నాయకుల్ని, ధ్వంసంచేయడం మన రెండవ యుద్ధాశయం. సోవియట్ యుద్ధఖైదీలను చిత్రవధ చేయడం, వారిని వందలాది సంఖ్యలో చంపివేయడం, వారికి తిండిపెట్టకుండా హతమొనర్చడం, హిట్లరు అనుచరులకు పరిపాటిఅయిపోయింది. మన దేశంలో వున్న సివిలియన్ ప్రజల్ని (అనగా, యుద్ధంలో పోరుసల్పనివారిని) వారు హత్యలకు గురిచేస్తున్నారు. స్త్రీ పురుషుల్ని, బాలబాలికల్ని వారు వధించివేస్తున్నారు. ఉక్రెయిన్, వైట్‌రష్యా, బాల్టిక్ ఏరియా, మాల్డేవియా, క్రిమియా, కాకేసస్‌లలో వారు నిరాయుధులైన ప్రజల్ని పెట్టే హింసలుచూస్తే, వీరు మనుష్యులా? పశువులా? అని సందేహించవలసి వస్తుంది. అమానుషమైన యీ ఘాతుకచర్యలు చూచి గౌరవంగల ప్రతివ్యక్తి సిగ్గుతో తలవంచుకోవలసివస్తుంది.

"ఉరి స్తంభాలతో వారు యూరప్‌ను నిర్మించారు. ఒకరు చేసిననేరానికి మరొకరిని శిక్షించే కిరాతక పద్ధతిని వారు ప్రవేశపెట్టారు. ఎవడైనా ఒక జర్మన్ పశువు ఒక స్త్రీని మానభంగం చేస్తూన్నప్పుడుగాని, దోపిడీ చేసేటప్పుడుగాని, యెవరైనా వానిని ఆటంకపరిస్తే అట్టివారి బంధువుల్ని వారు ఉరితీస్తున్నారు. ఈ రోజున యూరప్‌ఖండమంతా ఒక జైలు, అందులో వివిధ జాతులవారు ఖైదీలు. దీన్ని వీరు నూతన వ్యవస్థ' అనే పేరుతో పిలుస్తున్నారు. ఈ అఘాయిత్యాలన్నింటికి కారకులైనవారి పేర్లు మనకు తెలుసు. అనేకమంది గవర్నర్ జనరల్సుయొక్క, గవర్నర్లయొక్క సైన్యాధికారులయొక్క పేర్లు మనకు తెలుసు. చిత్రవధలకు గురి అయిన లక్షలాది ప్రజలందరికీ తెలుసు. వారు చేసిన నేరాలకు శిక్ష తప్పకుండా అనుభవించవలసి యుంటుందని యీ హంతకులు జ్ఞాపకముంచుకోవలసి యుంటుంది."

"మన మూడవ యుద్ధాశయం, యూరప్‌లో నిర్మించబడిన యీ 'నూతన వ్యవస్థ"ను నాశనం చేసి, దానికి కారకులైనవారిని కఠిన శిక్షలకు గురి చేయడం."

"కామ్రేడ్స్! ఈరోజున మనం స్వాతంత్ర్య మహాసంగ్రామంలో ఉన్నాం. ఇందులో మనం ఒంటరిగా నిలబడి పోరుసల్పడం లేదు. మన మిత్రరాజ్యాలు కూడా మనతో కలిసి పోరాడుతున్నాయి. మానవ జాతికి పరమ శత్రువులైన జర్మన్ - ఫాసిస్టు సామ్రాజ్య వాదుల్ని మనం తప్పక ఓడించగల్గుతాం. ఈ స్వాతంత్ర్య మహాసంగ్రామంలో తప్పక మనకు విజయం లభిస్తుంది." (4½ నిమిషాల సేపు కర తాళ ధ్వనులు)

"శత్రువు అంత్యదశ సమీపించుతోంది"

నవంబరు 7 వ తేదీ ఉదయం రష్యావిప్లవ దినోత్సవ సందర్భంలో కామ్రేడ్ స్టాలిన్ రష్యన్ ప్రజలకీ క్రింది సందేశాన్ని ప్రకటించాడు:—

"ఈ 25 సంవత్సరాలలో సోవియట్ యూనియన్ యొక్క ప్రజలు అత్యున్నతమైన కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఈ కాలంలో మన మాతృభూమియొక్క సోషలిస్టు పరిశ్రమలు, సమిష్టివ్యవసాయం ఎక్కువగా వృద్ధిపొంది, మన రాజ్యాంగ యంత్రం బలీయమైన ఒక కోటగా నిర్మించబడింది.

"మన రెడ్ ఆర్మీ యొక్క బల మెంత యెక్కువో శత్రువులు చక్కగా తెలుసుకున్నారు. కాని తుక్కుతుక్కుగా చేయగల సామర్థ్యం రెడ్‌ఆర్మీలో యెంత ఉన్నదో వారు యింకా రుచి చూడలేదు. పూర్వపు దండయాత్రలవంటివి యిపుడుకూడా జర్మన్లు చేయవచ్చు కాని శత్రుదళాల బలం తీవ్రమైన నష్టాలకు గురి అయింది. వాటి అంత్యదశ త్వరలోనే సమీపిస్తోంది........ సోవియటు యూనియనుపై యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు జర్మన్ సేనలలో మరణించినవారు, క్షతగాత్రులు, కలిసి మొత్తం 80 లక్షలమంది. 1941 వ సంవత్సరపు వేసవి కాలంలోను, ఆకురాలు కాలంలోను, నాజీ సేనల కున్నంత బలం యిప్పుడు లేదు. ఈ విష పురుగుల్ని మనం సోవియటు భూమి నుండి తొలగించాలి. అలాగు తొలగించగలం కూడా. ఇందుకు మనమంతా మనకు ముందున్న యుద్ధ రంగాలను పట్టుదలతో కాపాడుకోవలసి యుంది. శత్రువును యేమాత్రం ముందుకు రాకుండా చేయాలి. రెండవ విషయం : మన సైన్యంలో సర్వ విధాల దిట్టమైన క్రమశిక్షణ నాయకత్వపు ఐక్యత, వృద్ధిచేసుకోవాలి. మూడవ విషయం : శత్రువుచే ఆక్రమించుకొనబడిన అన్ని ప్రదేశాలలో మనం గెరిల్లా దళాలను నిర్మించవలసి యుంది.

"మన రెడ్‌ఆర్మీయొక్క ధాటియెలాంటిదో శత్రువులు త్వరలోనే రుచిచూడగలరు. మనం కూడా త్వరలో కొన్నితమాషాలు చూడవచ్చు! నవంబరు సోషలిస్టువిప్లవం యొక్క 25 వ వార్షికోత్సవం చిరస్థాయి అగుగాక!"

సవరణ

7 వ పేజీలో 1 వ కాలం 2 వ పేరా 5 వ పంక్తిలో 1000 అని అచ్చు తప్పు పడింది. చదువరులు పదివేలు అని సవరించుకొన ప్రార్థన.

సంపాదకుడు.

Published by Katragadda Rajagopala Rao and Printed at The Popular Printers, Governorpet, Bezwada.

END OF ISSUE